# పరువు ఖరీదు?

'సికిందర్'

ాక్టర్ రఘునాథ్ నాకిచ్చిన సలహా ఏమిటో మీకు చెప్పేముందు నా గురించి కొంత చెప్పుకోవాలి: నా రించి చెప్పుకునేందుకు ప్రత్యేకించి ఏమీ లేదు గానీ, ని నా జీవితంతో ఎంత తీవ్రంగా ఆడుకుని నన్ను దుర ృష్టవంతుడిని చేసిందో చెప్పవలసిన అవసరం చాలా ంది.

సరిగా నెలరోజుల క్రితంవరకు నా అంతటి అదృష్ట ంతుడు మరొకరు లేరనుకునేవాణ్ని. సేఠ్ రంగూన్ లా దగ్గర సెక్రటరీగా పదకొండు వందల జీతం సంపా స్తూ, సకల సౌకర్యాలూ అనుభవిస్తూ, నాకు నచ్చిన కి నీరజని ప్రేమిస్తూ, ఎలాటి చిక్కులూ లేకుండా లం గడిపేస్తోంటే, జీవితంలో మగవాడికి అంతకంటే వలసిందేమిటి?

నెలరోజుల క్రితం—నా బాస్ పార్టీ యిచ్చిన రాత్రి బ్రతుకు రాచబాట అనుకున్నాను. ఎన్నో కలలు

గన్నాను. జీవితం గురించి ఏవేవో వూహించుకున్నాను. ఇలాంటి అదృష్టం నాకు కలగడం వాస్తవమేనా, లేక కేవలం భ్రమా అనికూడా ఆశ్చర్యపోయాను. ఆ రాత్రి జీవితంలో మరపురాని రాత్రి. జీవితాంతం నెమరేసుకో వలసిన రాత్రి.

కానీ__అదే రాత్రి నేను కన్న కలలన్నింటినీ రక్తపు ధారలతో కడిగేసి, భవిష్యత్ గురించి నేను వూహించుకున్న వన్నింటినీ పటాపంచలు చేసేసింది...

నీరజని నేనెక్కడ, ఎప్పుడు చూశానో జ్ఞాపంలేదు గానీ, ఆమెనిచూసిన క్షణాన ఆమె నాకు కావాలన్పించింది. నీరజకూడ ఆ తర్వాత ఇదేమాట చెప్పింది. సుమారు మూడు నెలల క్రితం ప్రారంభమయిన మా పరిచయం క్రమంగా ప్రేమగా మారింది.

నీరజ హైద్రాబాదులో వుంటూ బియస్సి చదువుతోంది. ఆమె తలిదండ్రులు శ్రీకాకుళంలో వున్నారు. ఆమె వయసు సుమారు 20 వుండవచ్చు. చాలా నెమ్మది స్వభావం. ప్రతీ విషయం క్షుణ్ణంగా ఆలోచించడం ఆమె లక్షణం. ఆమెని చూడకముందు నాకు పెళ్ళిచేసుకోవాలన్న ఆలోచన అసలు రాలేదన్నది ఆశ్చర్యకమైన విషయం.

చివరికి_మా ప్రేమ ముదిరి పెళ్ళిచేసుకోవాలనుకున్నాం.

ఈ సంగతి విని నాబాస్ చాలా సంతోషించాడు.

నా బాస్ కి నేనంటే వల్లమాలిన అభిమానం. అందుక్కారణం అతనికి భార్యా పిల్లలు లేకపోవడం; నేను అతని దగ్గర అతివినయం ప్రదర్శిస్తూ సమర్థవంతంగా పని చేయడం.

వినయం ఒలకబోసే వాళ్ళంటే నా బాస్ కి చాల ఇష్టం.

మేం పెళ్ళి చేసుకోబోతున్నామన్న శుభవార్తను పురస్కరించుకుని ఆరాత్రి అతను బ్రహ్మాండమయిన పార్టీ ఏర్పాటు చేశాడు. మేం పార్టీకి వెళ్ళి పెద్దమనుషులనబడే వారిని ఆహ్వానించాం. అందరూ మమ్మల్ని అభినందించారు.

మేం ఎక్కడ, ఎప్పుడు, ఎలా పెళ్ళి చేసుకోబోతున్నామని బాస్ అడిగాడు. వారం రోజుల తర్వాత రిజిస్ట్రార్ ఆఫీసులో సంతకాలు పెట్టి వస్తామని చెప్పాను. అందుకు నా బాస్ సంతోషించి అరవయ్యేళ్ళు చిలకా గోరింకల్లా బ్రతకమని ఆశీర్వదించాడు. అంటే ఆపైన బ్రతకొద్దని కాదు అర్థం—నా బాస్ మాటలలాగే వుంటాయి.

పార్టీ ముగిసి అందరూ వెళ్ళిపోయాక, బాస్ నా చెయ్యి పట్టుకుని తన గదిలోకి తీసుకెళ్ళాడు. తలుపులు బిడాయించి నాపైన తనకున్న అభిమానాన్నంతా గుమ్మరించాడు.

పెళ్ళి కానుకగా పదివేల క్యాషు, చిన్న డాబాఇల్లు, ఆ ఇంట్లో సకల సౌకర్యాలు, నీరజకు నగలు, మేము షికారుకెళ్ళేందుకు స్కూటరూ...ఇంకా...ఇంకా... నేమేం చెప్పాడో అప్పటి ఆనందంలో మర్చిపోయాను.

అవన్నీ నాకెందుకని మొహమాట పడ్డాను. తనదగ్గర పిచ్చివేషాలు పనికిరావని కోప్పడ్డాడు. విధిలేక, చివరికి అతని కానుకల్ని స్వీకరించక తప్పలేదు!

గదిలోంచి బయటకు అడుగులేస్తుంటే నాకు నేలమీద నడుస్తున్నట్టు అనిపించలేదు—గాల్లో తేలుతున్నట్టు ఫీల్ అయ్యాను. నాచుట్టూ పదిమంది వున్నారని పట్టించుకోకుండా, నీరజ నడుంచుట్టూ చెయ్యివేసి బయటకి నడిచాను.

జీవితంలో యిలాంటి క్షణాలు చాలా అరుదుగా లభిస్తాయి.

నీరజతో నేను అడుగులేస్తుంటే ఈ ప్రపంచాన్ని జయించగలనన్న విశ్వాసం ఏర్పడింది. బాస్ నాకు చెప్పిన మాటలు ఆమెకి చెప్పినప్పుడు ఆమె యెంత పరవశించిపోయిందో వర్ణించడం అసాధ్యం. నేను చాలా అదృష్టవంతుడనని, నాలాంటి వ్యక్తి తనకి లభించడం ఏ జన్మలోనో చేసుకున్న పుణ్యమనీ...ఇంకా యిలాంటి మాటలు యెన్నో చెబుతూ మురిసిపోయింది.

నేను ప్రేమిస్తున్న వ్యక్తికి నాపైన ఇంత విశ్వాసం అభిమానం ఏర్పడినపుడు అంతకంటే నాకేం కావాలి. ఒకసారి నాబాస్ ఇచ్చే ఐశ్వర్యంతో, నీరజ అందించే ప్రేమలో జీవితం వూహించుకున్నాను. గాడ్! నన్ను వూపిరాడనీయకుండా ఉక్కిరిబిక్కిరిచేసే ఈ ఆనందాన్ని ఎలా తట్టుకోడం?

ఆటోయెక్కి యింటి కెళుతున్నప్పుడు మేము వుండబోయే ఇంటిగురించి మాట్లాడుకున్నాం.

నీరజ ఇంటిముందు పెద్దతోట వుంటే బావుంటుందని చెప్పింది. తోటవుంటే పక్షులుచేరి గోల చేస్తాయని నే నభ్యంతరం చెప్పాను. మనకోసం కాకపోయినా రేపు పుట్టబోయే పిల్లలకి తోట తప్పనిసరి అని చెప్పిందామె. ఈమాట అన్నప్పుడు ఆమె చెంపలు యెర్రబడ్డాయి. అప్పుడామె ముఖారవిందాన్ని చూసి నా మతిపోయి చటుక్కున ముద్దు పెట్టుకున్నాను.

అంతే! ప్రపంచం తలకిందులయిపోయింది... మేము పాతాళంలోకి విసిరివేయబడ్డాం. నీరజ గావుకేక నా

గుండెల్ని చీల్చివేసింది. నా కళ్ళముందు ఏవేవో పిచ్చి దృశ్యాలు కదిలి, ఆ తర్వాత ఏమీ కన్పించలేదు...

తిరిగి కళ్ళు తెరిచినప్పుడు నేను హాస్పిటల్లోవున్నాను. నా ఒంటినిండా కట్లున్నాయి. కాళ్ళు చేతులు కదలడం లేదు. మెడ తిరగడంలేదు. తల దిమ్మెక్కింది. పూర్తిగా తేరుకుని పరిస్థితి గ్రహించాను. మరుక్షణం జరిగిందేమిటో కళ్ళముందు మెదిలింది.

మేం ఆటోలో వెడుతోండగా అకస్మాత్తుగా ఓ వీధిలోంచి లారీ దూసుకొచ్చి ధడాలున గుద్దేసింది. ఆటో యెగిరి కొన్ని గజాలదూరాన పడింది. ఆ విసురుకు నీరజ ఆటోలోంచి యెగిరి ఎదురుగావున్న ఎలక్ట్రిక్ పోల్ ని గుద్దుకుంది. నేను రోడ్డుమీద చేపలా కొన్ని అడుగుల దూరం జారాను...

ఈ దృశ్యం కనులముందు కదిలి భయంకరంగా అరిచాను.

పక్కనే కూచున్న నా బాస్ నా అవతారంచూసి కర్చీఫ్ అడ్డం పెట్టుకుని ఏడ్చాడు. నా దురదృష్టానికి నా కంటే ఎక్కువ బాధపడ్డారు. చివరకి దుఃఖాన్ని బలవంతంగా దిగమింగి, బాంబులాంటి వార్త నా గుండెలో పేల్చాడు: నీరజ చనిపోయిందట.

ఎలక్ట్రిక్ స్థంభాన్ని గుద్దుకొని ఆమె తల రెండుగా చీలిపోయిందట. హాస్పిటల్ కి తెస్తూండగా దారిలోనే ప్రాణం పోయిందట.

నీరజ చనిపోయిందని తెలిసి నేనెందుకు యేడ్వలేదో ఇప్పటికీ అర్థంకాదు. పైగా నా దురదృష్టానికి పిచ్చిగా నవ్వుకున్నాను. నా మిత్రులు నాకు మతిభ్రమిస్తుందేమోనని భయపడ్డారు.

పదిహేను రోజులతర్వాత నన్ను డిశ్చార్జి చేశారు. ఈలోపు నీరజ తలిదండ్రులు వచ్చి నన్ను చూశారు. కూతురు మరణానికి దుఃఖించి, నా పరిస్థితికి జాలిపడి వెళ్ళిపోయారు.

నాకు చిన్న చిన్న గాయాలుతప్ప ఒంట్లో యెక్కడా ఎముకలు విరగలేదు. అందుకు నేను దేవునికిచాలా ఋణ పడి వున్నాను. గాయాలనుంచి త్వరగానే కోలు కున్నాను.

హాస్పిటల్ నుంచి వచ్చినమర్నాడే వుద్యోగంలో చేరాను. నా బాస్ తిట్టాడు. మరో 15 రోజులు ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకోమన్నాడు.

నేను ఫరవాలేదని చెప్పి అలాగే పనిచేయ సాగాను. అయితే నీరజ జ్ఞాపకం రాని క్షణంలేదు. విధి నేను వూహించని విధంగా కాటేసింది. నాకేమీ మిగలలేదు నీరజ జ్ఞాపకాలు తప్ప. ఆమెతో గడిపిన మధుర క్షణా లను నెమరు వేసుకుంటూ మొండిగా బ్రతుకుతున్నాను. నేనెలా ప్రవర్తిస్తున్నానో ఎదుటివాళ్ళు చెప్పేవరకూ తెలియడంలేదు.

ఒకరోజు గడ్డం గీసుకోకుండా ఆఫీసుకొస్తే, మరొక రోజు తల దువ్వుకోకుండా వస్తున్నాను. మరో రోజు మాసిన బట్టలతో వస్తే, ఆతర్వాతిరోజు ముఖంకడుక్కో కుండా వస్తున్నాను...ఇలాంటి వెన్నో నాకు తెలియని పనులు చేస్తున్నాను.

నేను చేస్తున్నదేమిటో నాకు తెలిసినా సరిదిద్దుకోవా లన్పించడంలేదు. ముఖం ఎందుకు కడుక్కోవాలి? బట్ట లెందుకు మార్చుకోవాలి? గడ్డం ఎందుకు గీసుకోవాలి? తల ఎందుకు దువ్వుకోవాలి?...అసలు తిండి యెందుకు

తినాలి?

నాకూ, నీరజకూ మధ్య విధి విలన్‌లా ప్రవేశించి విడ దీసినప్పుడు, ఈ లోకంలో నాకు పనేమిటి?

ఇక ఆఫీసులో పని సరేసరి. ఫైళ్ళు గల్లంతవుతూ వున్నాయి. ఒకరి 'ఉత్తరాలు ఒకరికి చేరుతున్నాయి. టైప్ రైటర్‌లో కాయితం ఎక్కిస్తే అర్థంలేని వింత భాష తయారవుతోంది...

బాస్ నా స్థితికి జాలిపడి యెన్నో రకాలుగా నచ్చ చెప్పాడు. కొంతకాలం పూర్తి విశ్రాంతి తీసుకోమని బలవంతం చేశాడు. నేను విన్పించుకోలేదు.

చివరికి—ఇలా పదిహేను రోజులు గడిచాక, ఒకరోజు బాస్ నన్ను పిల్చాడు. వెళ్ళాను. అతను నా చేతిలో ఒక చెక్కు పెట్టి, "కమల్, నాలుగేళ్ళుగా నా దగ్గర పని చేస్తున్నావు. ఏనాడయినా నిన్ను తిట్టానా? నువ్వు బాధ పడేమాట చెప్పానా? లేదు, నేను నమ్మిన మనుషుల్ని బాధించను! నువ్వంటే నాకెంత ఇష్టమో నీకేం తెలుసు? నువ్వెన్ని తప్పులు చేస్తున్నా జాలిపడ్డాను కాని, కనీసం వినుకోక్కనయినా లేదు! ఇప్పుడు నీ పరిస్థితి చూస్తోంటే భయం వేస్తోంది! నువ్వులేని నన్ను వూహించుకోడమంటే కమల్! మైబాయ్, నన్ను కాపాడు! అన్యాయం చెయ్యకు" అనర్చాడు.

నేను గాభరపడ్డాను. "బాస్! ఇప్పుడేం జరిగింది?"

బాస్ నెమ్మదిపడి అన్నాడు, "ఆ చెక్కు చూడు!"

చూశాను. అది నేను వ్రాసిన చెక్కు: అక్షరాల్లో పదివేలు—అంకెల్లో లక్ష!

నా నోటమాట రాలేదు. పెదవులు చప్పరించి నిస్స హాయంగా చూశాను.

# 10

బాస్ నవ్వి నా భుజం తట్టాడు, "కమల్, యీ పది హేను రోజుల్లో ఆఫీసుని సర్కసు కంపెనీలా మార్చే శావు. నువ్వు పంపుతున్న వుత్తరాలు తారుమారయి పార్టీలు తిడుతూ జాబులు వ్రాస్తున్నారు. ఇక ఆఫీ సులో కొన్ని ఫైళ్ళు కన్పించడంలేదు. పట్టుకెళ్ళి యే పార్కులో పడేశావో దేవుడెరుగు. టైపింగ్ సంగతి సరేసరి. చెక్కులమీద రాతలు చెప్పనవసరంలేదు. ఆహాఁ ఆఫీసు ఎంత శోభాయమానంగా విరాజిల్లుతోంది."

నాకు ఏడుపు ముంచుకొచ్చింది.

"క్షమించండి బాస్" అన్నాను.

బాస్ జాలికళ్ళు నామీద పడ్డాయి.

"క్షమిస్తాను—నువ్వు నామాట వింటే తప్పకుండా క్షమిస్తాను" అన్నాడు.

"చెప్పండి?"

బాస్ నిట్టూర్చి అన్నాడు, "కమల్ నువ్వు మాన సికంగా చాలా దెబ్బతిన్నావు. నీకు ట్రీట్ మెంట్ చాలా అవసరం. ఇంకా నిర్లక్ష్యంచేస్తే నువ్వు సర్వ నాశనమవుతావు. నీ కేదయినా జరిగితే నేను సహించను కమల్! డాక్టర్ రఘునాథ్ తో నీ విషయం మాట్లా డాను. నిన్ను బాగుచేసి మామూలు మనిషిని చేస్తానని నాకు హామీ ఇచ్చాడు. నామీద నీకేమాత్రం గౌరవం వున్నా వెంటనే వెళ్ళి డాక్టర్ని కలుప్!"

నేను అభ్యంతరం చెప్పలేకపోయాను.

బాస్ నాకు ఎన్నో విధాలుగా చేసిన సహాయానికి నే నేవిధంగానూ ఋణం తీర్చుకోలేను. కనీసం యీ అభ్యర్థనను గౌరవించి తృప్తి కలిగించాలనుకున్నాను.

కాబట్టి వెంటనే డాక్టర్ రఘునాథ్ ని కలిశాను.

అతను నాకిచ్చిన సలహా నన్నాశ్చర్య పర్చింది.

"మిస్టర్ కమల్!" అన్నాడతను. "నీ గురించి బాస్ చెప్పారు. నీ ప్రవర్తనని బట్టిచూస్తే, నీ మానసికారోగ్యం త్వరలోనే బాగు చేయలేనంతగా చెడిపోతుంది. నీ జీవితంలో తగిలిన అఘాతంనుంచి కోలుకోవాలంటే నీకు వాతావరణం మార్పుకావాలి. కొన్నాళ్లపాటుకొత్త ప్రదేశం అవసరం. కాబట్టి కొంతకాలం నువ్వీ సిటీవదిలి పెట్టాలి—మూడు నెలలు చాలు..."

డాక్టర్ మాటలు నాకర్థంగాలేదు.

"సిటీ వదిలి పెట్టాలా? ఎక్కడికి కెళ్ళాలి?" అడిగాను.

"చెప్తాను—నేను బాగా ఆలోచించి ఈ నిశ్చయానికి వచ్చాను. నువ్వీ సిటీ వదిలివెళ్ళి సంపూర్ణారోగ్యంతో తిరిగివచ్చే ప్రదేశం ఒకటివుంది: ఖమ్మం. అక్కడ నా కూతురు మాధవి వుంది. ఆమె ఒకపత్రిక నడుపుతోంది. నీ గురించి ఆమెకి వ్రాశాను. మొదట అభ్యంతరం చెప్పినా తర్వాత అంగీకరించింది.

"కమల్, నువ్వక్కడికెళ్ళి ఆమెతో పత్రిక వ్యవహారాల్లో పాలుపంచుకో. నీ విషయంలో యింతకంటే మంచి ట్రీట్ మెంట్ లేదు. కొన్నాళ్లపాటు పత్రికా ప్రపంచంలో గడిపితే నువ్వు గతాన్ని పీడకలగా మర్చిపోతావు. తిరిగివచ్చి భవిష్యత్ కి కొత్తబాట నిర్మించుకుంటావు. నాకు నమ్మకముంది. ఏమంటావ్?"

ఏమనాలో తోచలేదు. తలూపాను.

"వెరీగుడ్! ఈ విషయం నేను బాస్ తో మాట్లాడాను. అంగీకరించాడు. నువ్వక్కడ వున్నంతకాలమూ ఖర్చులన్నీ అతడే భరిస్తాడు. అతను ఇచ్చే కార్లో రేపు

పుదయం బయలుదేరు. మధ్యాహ్నం చేరుకుంటావు. వైరా రోడ్డులో హోటల్ నర్తకిలో బసచెయ్యి. రైల్వే స్టేషన్ దగ్గర మాధవి ఆఫీసువుంది—'విశ్వశక్తి' ఆఫీసు ఎక్కడుందంటే ఎవరయినా చెప్తారు. అర్థమయిందా? విష్ యూ గుడ్ లక్!''

## 2

డాక్టర్ సలహా ప్రకారం మర్నాడు పుదయం నా బాస్ ఇచ్చిన కారులో ఖమ్మం బయలుదేరాను. అక్కడికి వెళ్ళి నేను బాగుపడి రావచ్చునేమోగాని, భవిష్యత్ మీద నమ్మకంలేదు.

నీరజలేని బ్రతుకు బ్రతుకేకాదు. ఆమె సహచర్యం లేని భవిష్యత్తుని పూహించలేను.

డాక్టర్ సలహా నాకంత రుచించిలేదుగానీ, నా బాస్ అతని కుటుంబం గురించి వివరాలు చెప్పినప్పుడు అక్కడికి వెళ్ళితీరాలన్న పట్టుదల కలిగింది.

డాక్టర్ రఘునాథ్ ఇరవైఏళ్ళ క్రితం హైద్రాబాదులో స్థిరపడ్డా, అతని ఆస్తులూ, వ్యవసాయం మాత్రం ఖమ్మం లోనే వున్నాయి. హైద్రాబాదులో క్లినిక్ నడుపుతూ మంచిపేరు తెచ్చుకున్నాడు. నా బాస్‌కి సన్నిహితుడు.

అతని ఏకైక సంతానం మాధవి. ఎం.ఏ వరకు చదివింది. చదువు పూర్తవడంతోనే ఆమెతల్లి చనిపోయింది రెండేళ్ళ క్రితం. ఇక ఆమె హైద్రాబాదులో వుండదలచుకోలేదు. ఎక్కడా పుద్యోగం చేయదలచుకోలేదు. ఖమ్మంలో స్థిరపడి ఇతరుల చేతుల్లోవున్న తమ వ్యవసాయం చూసుకోవాలనుకుంది. తండ్రి అభ్యంతరం చెప్పలేదు. అప్పటినుంచీ ఆమె ఖమ్మంలో వ్యవసాయం చూసు

కోడమేగాక, పత్రిక కూడా ప్రారంభించింది.

ఆ పత్రికకి రాష్ట్రవ్యాప్తంగా సర్క్యులేషన్ వుంది. రాజకీయవాదుల్లో దానికి మంచి గుర్తింపువుంది. ప్రతివారం రాజకీయాలు—సమాజంలో అవినీతి-నేరాలు మొదలైన విషయాలతో వెలువడే 'విశ్వశక్తి'కి కేవలం రెండేళ్ళ కాలంలో గట్టి పునాదులు ఏర్పడ్డాయి.

నా బాస్ నాకు వీడ్కోలు చెబుతూ, సాధ్యమైనంత త్వరలో సంపూర్ణారోగ్యంతో తొణికిసలాడుతూ తిరిగి రమ్మని ఆశీర్వదించాడు.

మధ్యాహ్నం ఒంటిగంటవుతోండగా ఖమ్మం చేరాను. అక్కడి పరిసరాలు, వాతావరణం నన్ను వింత గొలిపాయి. హైద్రాబాదులాటి నగరాలు తప్ప ఇలాటి టౌన్‌లకి ఎన్నడూ వెళ్ళని నాకు, మూడు నెలలు ఖమ్మంలో గడపాలంటే ఎలాగో అన్పించింది.

కారుని తిప్పి కలకత్తాదారి పట్టాలనుకున్నాను గానీ, మరుక్షణం బాస్ జ్ఞాపకం వచ్చి ఆ ఆలోచన విరమించుకున్నాను.

హోటల్ నర్తకిలో రూం బుక్ చేసుకుని మాధవి ఆఫీస్‌కి ఫోన్ చేశాను—రెస్పాన్స్ లేదు. ఇంటికి చేశాను అక్కడా లేదు.

స్నానం ముగించి భోజనం చేసి మళ్ళీ ఫోన్ చేశాను. అయినా సమాధానం లేదు. ఎక్కడికెళ్ళి వుంటుందో నాకు తెలియదు. గంటసేపు నిద్రపోయాను. గాఢమైన నిద్రపట్టింది. మేల్కొని చూస్తే సమయం అయిదయింది. వెంటనే బట్టలు మార్చుకుని బయటపడ్డాను. ఈసారి ఫోన్ చేయదలచలేదు. నేరుగా ఆఫీసు కెళ్ళాలనుకున్నాను.

డాక్టర్ నాకిచ్చిన అడ్రసు ప్రకారం రైల్వేస్టేషన్‌కి దారి కనుక్కొని కారులో బయలుదేరాను. కారు వెళు తోంటే నన్ను వింతగా, ప్రత్యేకంగా చూడసాగారు. అక్కడక్కడ దారిలో పోకిరిపిల్లలు కారువెంట పడి అరిచారు.

పత్రికాఫీసు కనుక్కోవడం కష్టమేమీ కాలేదు. స్టేషన్ సమీపంలో రెండంతస్తుల బిల్డింగ్‌లో వుంది. బిల్డింగ్ ముందు కారాపి మెట్లెక్కాను. కార్లోంచి దిగి మెట్లెక్కుతోంటే యెదురుగావున్న కిళ్ళీకొట్టు దగ్గర కొందరు కుర్రాళ్ళు తదేకంగా చూడసాగారు. ఒక్క చూపులో పసిగట్టాను, అది రౌడీమూక అని.

పై అంతస్తు చేరుకుని నడవాలో చకచక నడిచాను. ఆ అంతస్తులో రెండుమూడు ఇతర ఆఫీసులున్నాయి. వాటి ద్వారాలమీద సైన్‌బోర్డులున్నాయి. కాబట్టి 'విశ్వశక్తి' ఆఫీసు సులభంగా దొరికింది.

ఆఫీసు తలుపు బార్లా తెరిచివుంది.

ఒక్క అడుగు లోనికి వేసి అటూ ఇటూ చూశాను. కుడిపక్క మూల టేబిల్ వెనక, రకరకాల ఫైళ్లు ముందేసుకుని ఒక స్త్రీ కూచోనివుంది. ఆమె మాధవి అని గ్రహించాను. ఆమె నా వునికి పసిగట్టలేదు. తల వంచుకుని శ్రద్ధగా ఫైలు పరిశీలిస్తోంది.

నేను సందేహించి, "గుడ్‌మార్నింగ్!" అన్నాను.

ఆమె తలెత్తి చూసింది. కళ్ళు చిట్లించి, "యస్?" అంది.

ఆమె స్వరం విని నా మాటలు తడబడ్డాయి, "నేను నన్ను... మీ డాడీ పంపించారు..." అన్నాను.

ఆమె తటాలున ముందుకు వంగి, "ఓ, రండి! మీరు

కమలాకర్ కదూ?" అంది, ఆసక్తిగా చూస్తూ.

నేను తలూపి లోనికి నడిచాను.

ఆమె ఫైళ్ళన్నీ పక్కకి తోసి, కుర్చీ చూపించి కూచోమంది.

నేను కూచొని ఆమెకేసి చూశాను. గంభీరంగావున్న ఆమె ముఖంచూసి గాభరాపడ్డాను. ఆమెకు పాతికేళ్ళుంటాయి. చాలా సాదాగా అలంకరించుకుంది-చామన ఛాయ రంగు, విశాలమైన నుదురు, గుండ్రటి కళ్ళు, ఎర్రటి పెదవులు, పొడవాటి చేతివేళ్ళు, అందంగా కత్తిరించుకున్న గోళ్లు, గుండ్రటి భుజాలు-ఆమెలో ముక్కు తప్ప తండ్రిపోలిక ఎక్కడాలేదు-నగరాల్లో కృత్రిమ అందాన్ని చూసిచూసీ విసిగిపోయిన నాకు, మాధవిని చూశాక కొంత రిలీఫ్ కలిగింది.

"ఎప్పుడొచ్చారు?" అడిగిందామె మృదువుగా.

"మధ్యాహ్నం-- మూడుసార్లు ఫోన్ చేసాను-మీరు పలకలేదు" అన్నాను ముక్కలు ముక్కలుగా.

"సారీ! అత్యవసర పనిమీద ఒక చోటికి వెళ్లాను. కమలాకర్ గారూ__"

"కమల్ అని పిలవండి."

"మంచిది. కమల్ గారూ, మీ గురించి నాన్నగారు వ్రాశారు. మీ పరిస్థితికి నేను జాలిపడ్డం తప్ప యేమీ చేయలేను. నాకే సవాలక్ష సమస్యలున్నాయి-యీ విధంగా మాట్లాడుతున్నందుకు క్షమించండి..."

నేనేమీ అన్లేదు.

"నాన్నకి నేను వివరంగా వ్రాశాను__ఇక్కడి పరిస్థితులు. ఆయన విన్పించుకోలేదు. చిత్రమయిన మనిషి! మనసులో ఏది తడితే అది చేసి తీరాలంటాడు. సరే,

మీరేమీ అధైర్యపడనవసరంలేదు. గతాన్ని మర్చిపోండి! మీరు మగవారు. అనుక్షణం కష్టాల్ని, బాధల్ని నెమరు వేసుకుంటూ కృంగిపోతోంటే ప్రపంచం ముందుకు సాగదు.

మిస్టర్ కమల్, మీరు నేనూ జీవితంలో ఒక దశలో ఒకే అనుభవానికి లోనయ్యాం_మీరు ప్రియురాల్ని, నేను తల్లినీ పోగొట్టుకుని ఒకే చోటుకి చేరుకున్నాం. అంతేకదూ? ప్రియురాల్ని సంపాదించుకోడం సులభం. కానీ తల్లిని సంపాదించుకోడం అసంభవం మిస్టర్ కమల్!''

''మీ దురదృష్టానికి చాలా చింతిస్తున్నాను మాధవి గారూ!'' అన్నాను.

ఆమె బలహీనంగా నవ్వి విషయం మార్చేసింది, ''బహుశ నాన్న మీకు పూర్తి వివరాలు చెప్పలేదనుకుంటాను. లేకపోతే మీరిక్కడికి వచ్చేవారు కాదు.''

''అవును, ఆయన వివరాలేమీ చెప్పలేదు. ఏమిటవి?''

''ఇక్కడి వాతావరణం మీ ఆరోగ్యానికి మంచిది కాదు. నా దగ్గర పనిచెయ్యడం మీకు క్షేమం కాదు!''

''అంటే?''

''రిస్క్—రిస్క్ తీసుకోవలసి వుంటుంది. మీకు మానసినబలం లేనప్పుడు రిస్క్ ఎందుకు?''

''దయచేసి వివరంగా చెప్పండి'' అన్నాను.

''పత్రిక వ్యవహారాల్లో నాకు సహాయపడతానంటే అభ్యంతరం లేదు'' అందామె సూటిగా చూస్తూ. ''ఈ సహాయానికి ప్రతిఫలముండదు, పైగా కష్టాలనెదుర్కోవలసి వుంటుంది. కమల్, నా పత్రిక పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నా, ఆర్థికంగా యింకా నిలదొక్కుకో

లేదు. నష్టమైనా భరిస్తూ పట్టుదలతో నడిపిస్తున్నాను. ఇప్పటివరకు వ్యవహారాలన్నీ నేనే ఒంటరిగా చూసుకుంటున్నాను. అప్పుడప్పుడు ప్రతిఫలం కోరకుండా సహాయపడతామని చాలామంది వచ్చారు గానీ, ఎంతో కాలం వుండలేకపోయారు"

"ఎందుకు?"

"ప్రాణభయం".

"ఏమిటి మీరనేది!"

"ప్రాణభయంవల్ల ఎవరూ నాదగ్గర పని చెయ్యడానికి ఒప్పుకోరు" అందామె.

"ఆ భయం ఎవరివల్ల?"

"మిస్టర్ కమల్, నాన్న యీ వివరాలన్నీ మీకు చెప్పకుండా అనవసర శ్రమ కల్గించారు. నేను చెప్తాను వినండి: ఆ తర్వాత మీరు కనుక బుద్ధిమంతులైతే, మీ క్షేమం కోరి చెబుతున్నాను-దయచేసి ఈ వూరు విడిచి వెళ్ళిపోండి."

"బెదిరిస్తున్నారా?"

"మీ ఇష్టం-ఎలాగైనా అనుకోండి. కానీ, బెదిరించేది నేను కాదు. ఈ వూళ్ళో ఒక ముఠావుంది-జానీగ్యాంగ్ అని పోలీసులంటారు—గ్యాంగ్ లీడర్ జానీ, తాను మాఫీయా మొనగాడని మురిసిపోతుంటాడు. చూస్తే వాడికి పాతికేళ్ళుండవుగానీ మహాకిరాతకుడు. వాడి అనుచరులు ముప్ఫైమంది వున్నారు - తొమ్మిదేళ్ళ నుంచీ ఇరవైఏళ్ళ కుర్రాళ్ళ వరకూ.

"మిస్టర్ కమల్, ఒక్కసారి జానీని చూస్తే మళ్ళీ మీకు నిజ జ్ఞాపకం రాదంటే నమ్మండి. వాడి విష

యంలో పోలీసులు ఏమీ చెయ్యలేకపోతున్నారు. చెయ్యలేరు కూడా. వాడి అనుచరుల్ని అప్పుడప్పుడు లాకప్ లో వేసి తోముతుంటారు. అంతే. జానీగాడు చేసే అమానుష కృత్యాలకి ఎక్కడా ఆధారాలు దొరకవు.

“నేనీ వూరికి వచ్చిన కొత్తలో నన్ను అల్లరిపెట్టేవాడు. నేను పోలీసురిపోర్టు యిచ్చాను. వాడి అనుచరుల్ని దేహశుద్ధి చేశారు. అప్పటి నుంచి వాడు నా మీద పగబట్టాడు. కానీ, యింతవరకూ నన్నేమీ చేయలేదు. చెయ్యడు—అది వాడికి తెలుసు. అయితే నా దగ్గర పని చేసే వాళ్ళని బెదిరిస్తుంటాడు.”

ఈ వివరాలన్నీ విన్న తరువాత ఇందాక కిళ్ళీకొట్టు ముందు నిలుచున్న కుర్రవాళ్ళు జ్ఞాపకం వచ్చారు. తదేకంగా, కర్కశంగా చూస్తున్న ముఖాలు కళ్ళముందు కదిలాయి

నా వొళ్ళు జలదరించింది!

మాధవి మళ్ళీ అంది: “మిస్టర్ కమల్, దయచేసి నా మాటవిని వెళ్ళిపోండి. మీకేదయినా సంభవిస్తే బాధ్యత వహించడం నావల్ల కాదు. పరిష్కరించవలసిన సమస్యలు నాకు చాలావున్నాయి. మీరూ వొక సమస్య కాకూడదు.”

“కాను. నామీద మీకెలాంటి బాధ్యతవుండదు. ఐతే ఒక విషయం చెప్పండి: వాళ్ళు ఏమని బెదిరిస్తారు?”

“మొన్నటివరకూ పనిచేసిన రిటైర్ టీచర్ని గురించి చెప్తాను” అందామె. “పాపం, అతను బాగా పనిచేసేవాడు. ఇంటిదగ్గర పనిపాటా లేదు కాబట్టి నా దగ్గర వుంటానన్నాడు. మర్నాటినుంచి అతనికి ఉత్తరాలు రాసాగాయి—పని మానుకుని ఇంట్లో కూచోమని. నేను

లేని సమయాల్లో జానీ వచ్చి బెదిరించేవాడు — తక్షణం పని మానకపోతే చీకట్లో ఒంటరిగా కనిపించినపుడు నీ పని పడతామని. అతనికి భార్యా పిల్లలు వున్నారు. ఈ రిస్క్ తీసుకో దలచలేదు. వెంటనే పని మానేశాడు."

ఇలాంటి రౌడీమూక గురించి నాకు బాగా తెలుసు. హైద్రాబాదులో తరచు ఎదుర్కొనేవాడ్ని—కాని, ఓడి పోయేవాణ్ని.

మళ్ళీ ఇక్కడ జానీ గ్యాంగు గురించి విన్న తర్వాత భయంవేసింది.

చీకట్లో ఒంటరిగా కన్పించినపుడు... ఎవడయినా పిడికిలి బిగించి మూతిమీద కొడితే నా అందమయిన పలువరస పోగొట్టుకుంటాను. లేదా, చెయ్యి మెలేసి నడుము మీద చాచి తన్నితే వెన్నుపూస విరిగి యెందుకూ పనికి రాకుండా పోతాను.

ఆందోళనగా జేబులోంచి సిగరెట్ కేసు తీశాను. అది నా బాస్ ఇచ్చిన పుట్టినరోజు కానుక! మూడు వేల రూపాయల విలువచేసే బంగారపు సిగరెట్ కేసు.

"కమల్," మళ్ళీ అందామె. "ఉన్న వాస్తవాలు మీ ముందుంచాను — తర్వాత నాకు మాటరాకుండా, మీరు బాగా ఆలోచించి నిర్ణయానికి రండి. సాధ్యమయినంత వరకు ఇక్కడనుంచి వెళ్ళిపోవాలనే ఆలోచించండి. మీరేమీ జేమ్స్‌బాండ్ కాదు కష్టాల్ని కంఠానికి చుట్టుకు తిరగడానికి. ఏమంటారు?"

నేనేమీ అన్లేదు. సిగరెట్ వెలిగించాను. మౌనంగా దీర్ఘంగా ఆలోచించాను.

మాధవి నన్ను అందరిలాగే తక్కువ అంచనా వేయడము నన్నెంతో బాధించింది. ఆమె అంచనాని ఛాలెం

జీగా తీసుకుని నా సామర్థ్యం యెందుకు నిరూపించుకోకూడదు?

నా ఆలోచన సబబుగా తోచింది...

"మాధవిగారూ, నిజంగా జానీ నా పని పడతాడంటారా? మీరు నమ్ముతారా?" అడిగాను.

"సందేహం లేదు. నా దగ్గర ఎవరున్నా వాళ్ళపని పడతాడు."

"పోలీసు రక్షణ ఎందుకు తీసుకోకూడదు?"

"ఎంతకాలం తీసుకుంటారు? వాళ్ళు బాడీగార్డ్సు కారు—మీరు ఇండియాకి ప్రెసిడెంట్ కాదు?"

"ఆల్ రైట్—పోలీసు సహాయం లేకుండా ఈ రిస్కు నేను తీసుకుంటాను. మీ అభిప్రాయమేమిటి?"

"ఇంత వివరించి చెప్పాక నా అభిప్రాయం అనవసరం. మీ ఇష్టం కమల్ గారూ. మీపైన నాకెలాంటి బాధ్యతా లేదు. నన్నెలాటి గొడవల్లోనూ యిరికించకూడదు... నా మాటవిని మీరు వెళ్ళిపోతారనుకున్నాను. మీ ఆత్మాభిమానం ఒప్పుకోలేదు. సరే, ఎవరి రాతఎలా వుందో ఎవరికి తెలుసు? కానివ్వండి!" అందామె.

"చాలా థాంక్స్. అయితే నన్నిప్పుడు ఏం చెయ్యమంటారు?"

"ఏమీలేదు—రేపుదయం రండి. ఏం చెయ్యాలో చెప్తాను. ఎక్కడ బసచేశారు?" అడిగిందామె.

చెప్పాను.

"మంచిది" ఆమె కళ్ళు నా సిగరెట్ కేసుమీద పడ్డాయి, "అది జాగ్రత్త! బంగారపుది కదూ?"

నవ్వి థాంక్స్ చెప్పి వెనుదిరిగాను.

నడవాలో చకచక నడిచి మెట్లు దిగసాగాను.

ఈ అనుభవం నాకు వింతగావుంది. మాధవి చెప్పిన పరిస్థితులను గనుక నేనెదుర్కోబోతుంటే, అందులో విజయం సాధిస్తే, ఆ గర్వం జీవితాంతం ఉట్టిపడగలదు.

అయితే, ఆశ్చర్యమేమిటంటే, మాధవిని చూశాక నీరజని పూర్తిగా మరచిపోయాను. ఆమెతో గడిపిన మధురక్షణాలు తలంపుకయినా రావటంలేదు...ఇక్కడ యెవరయినా నా పళ్ళూడగొడితే తప్ప జ్ఞాపకంవచ్చేలా లేదు.

మెట్లుదిగి కారువేపుకు నడిచాను. నా కళ్ళు భీతిగా కిళ్ళీకొట్టువేపు చూశాయి. అక్కడెవరూ లేరు. నెమ్మదిపడ్డాను. చకచక నడిచి కారుడోర్ తెరిచాను. ఇందాక నేను చూసింది జానీమురా ఏమో తెలీదు...

ఇంతలో ఓ పదిహేనేళ్ళ కుర్రాడు హఠాత్తుగా నన్ను ఢీకొని, విచిత్రమైన అరుపు అరిచాడు. తిరిగి చూసేంతలో—క్షణకాలంలో—మెరుపులా ముందుకు దూసుకుపోయాడు.

నాకేమీ అర్థంకాలేదు.

హోటల్‌కొచ్చి బట్టలు మార్చుకుంటున్నప్పుడు గానీ తెలియలేదు—వాడు నా సిగరెట్ కేసు కొట్టేశాడని.

## 3

మర్నాడు ఉదయం పదిగంటలకి ఆఫీసుకెళ్ళాను.

అప్పటికే మాధవి అక్కడవుంది. ఆమెను చూశాక క్రితం సాయంత్రం జరిగిన సంఘటన జ్ఞాపకంవచ్చి, ఆమెకి చెప్పాలా వద్దా అని ఆలోచించాను. చివరికి చెప్పకూడదనే నిశ్చయించుకున్నాను.

ఇది నా స్వంత బాధ్యతమీద తీసుకొన్న రిస్కు కదా?

"గుడ్ మార్నింగ్, ఆలస్యమయిందను కుంటాను?" అన్నాను.

ఆమె తలెత్తిచూసి నవ్వింది, "ఫర్వాలేదు, యెప్పుడేనా రావచ్చు, ఎప్పుడేనా వెళ్ళవచ్చు."

నేను లోనికి నడిచి ఆమె కెదురుగా కూచుంటే, ఆమె మరోమూలవున్న టేబిల్ చూపించి, అక్కడ కూచోమంది. నేను చెప్పినట్టు చేశాను.

"కమల్, మీరిప్పుడు చేయవలసిం దేమీ లేదు. ఆ బీరువాలో పాత సంచికలున్నాయి, తీసి చదువుకోండి" అందామె.

మళ్ళీ నేను మాటాడే అవకాశం ఇవ్వకుండా ఫటుక్కున కలం అందుకుని గబగబ ఏదో వ్రాయసాగింది.

నేను విసుగ్గా బీరువా తెరచి పత్రికలు తీశాను. పత్రిక గెటప్స్ నన్ను విపరీతంగా ఆకర్షించాయి. ఐతే లోపలి సాహిత్యం చిరాకు తెప్పించింది. కల్పనా సాహిత్యం తప్ప నేనేదీ చదవను. బొత్తిగా ప్రపంచ జ్ఞానంలేకుండా పోతోందని నా బాసు తిట్టేవాడు. అప్పుడు కాస్సేపు దినపత్రిక తిరగేసేవాణ్ని.

దాదాపు పది సంచికలు తిరగేశాను. వాటిలో నన్ను ఏమీ ఆకర్షించలేదు. రాజకీయాలు, రకరకాల సమస్యలు సంపాదకీయాలు, భూస్వాముల దోపిడీలు, ఆడవాళ్ళపట్ల అత్యాచారాలు, ఇంకా ... మోసాలు, దొంగతనాలు, హత్యలు...ఇలా ఎన్నో విషయాలు.

సుమారు గంట గడిచింది. ఈమధ్య మాధవి ఒక్కసారికూడా నన్ను చూడలేదు. నేనప్పుడప్పుడు చూస్తూనే వున్నాను. తల వంచుకుని యేదో సీరియస్ గా వ్రాస్తోందామె.

నాకు విసుగు పుట్టింది.

పత్రికలన్నీ కట్టగా చేర్చి బీరువాలో పెడుతోండగా అందులోవున్న మరో పత్రిక ముఖపత్రం నన్నాకర్షించింది. అత్రుతగా అందుకున్నాను.

ఆ ముఖపత్రం మీదవున్న ఫోటో చూసి వులిక్కిపడ్డాను.

ఎవరితను? నక్సలైటా?

గబగబ పేజీలు తిరగేశాను.

విషయసూచికలో ముఖచిత్రం పేరువుంది. బి. సి. శంకర్.

దాదాపు సగంపత్రిక శంకర్ గురించే వుంది.

శంకర్ ఎవరో రాజకీయ నాయకుడైతే పత్రిక బీరువాలో పెట్టేసేవాణ్ని. కానీ, అతను నేరస్థుడు. కిరాతకుడు. దుర్మార్గుడు. సంవత్సరంన్నర క్రితం ఖమ్మంలో పెత్తందార్ల ఆగ్రహానికి గురయి, దగ్ధమైన హరిజనవాడల కేసులో అరెస్టయి, సికింద్రాబాదు జైలుకెళ్ళాడు. ఆ దహనకాండలో అతనిది పెద్దహస్తం. అయితే అతన్ని ప్రేరేపించిన పెత్తందార్లు మాత్రం శిక్షనుంచి తప్పించలేకపోయారు.

అంతక్రితం శంకర్‌కి పోలీసురికార్డ్ వుంది. ఖమ్మంలో పేరుపొందిన రౌడీ. ఎక్కడే గొడవ జరిగినా అక్కడ వుంటాడు. సోడాబుడ్లు విసరడంలో ఆరితేరిన వాడు. తెలంగాణా ఉద్యమానికి ముందు ఎక్కడ వుండేవాడో తెలీదు. ఉద్యమం మంచి ఊపులో వున్నప్పుడు ఊళ్ళో ప్రవేశించాడు. ఆ రోజుల్లో యెందరో కానిస్టేబిల్స్‌ని కొట్టాడు. ఒక సి.ఆర్.పి ఉద్యోగి రైఫిల్ లాక్కుని పారిపోయాడు. ఆ సందర్భంగా అరెస్టయ్యాడు.

ఉద్యమం చల్లబడ్డాక ఊళ్లో క్రైం కంట్రాక్టర్‌గా స్థిరపడ్డాడు. ఎవరికే 'పని' కావాలంటే ఆ 'పని' చేసి పెడతాడు_బిల్లు బరువుగానే వుంటుంది. ఆధారాలుండవు. ఒకసారి ఒక క్లయింట్ కోరికమీద సన్యాసి వేషంలో వెళ్ళి పొలాల్లోవున్న పదిమందిని చిత్తుగా తన్ని వచ్చాడు. ఆ సన్యాసి యెవరో పోలీసులకు మిస్టరీగా మిగిలి పోయింది...

శంకర్‌కి ధైర్యసాహసా లెక్కువ. అనుచరుల్ని ఆహ్వానించడు. అన్నీ స్వంతంగా చూసుకుంటాడు. దేహ శుద్ధి చెయ్యడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. బలిష్టమైన శరీరం. చామనఛాయ వర్ణం. గంభీరమైన స్వరం. ముఖంలో కన్పించే క్రూరత్వం చిరుతపులిలో కూడ వుండదు... శంకర్ పేరు వింటే చిన్నపిల్లలు లాగులు తడుపుకుంటారు పెద్దవాళ్ళు కళ్ళుమూసుకుని దేవుడ్ని ప్రార్థిస్తారు...

ఈ వివరాలన్నీ నన్ను ఆసక్తిగా, డిటెక్టివ్ కథలా, చదివించాయి.

"ఏం చదువుతున్నారు?"

తేరుకుని వెనక్కి,తిరిగి మాధవిని చూశాను.

"శంకర్...శంకర్ గురించి" నా మాటలు తడబడ్డాయి.

చిన్నగా నవ్విందామె, "శంకర్!...కిరాతకుడు... దుర్మార్గుడు. పాపం! చేసిన తప్పులకి ఏనాటికైనా, ఎవరైనా శిక్ష అనుభవించక తప్పదు కదా! ప్చ్, సరే, యిప్పుడు ఆఫీసు మూసేస్తున్నాను. వుంటారా, వెళతారా?"

టైం చూశాను. పన్నెండు దాటింది.

"వెళ్తాను. మళ్ళెప్పుడొస్తారు?"

"చెప్పలేను_సాయంత్రం లయన్స్ మీటింగ్ కి వెళ్ళవలసివుంటుంది. ఒకపని చేద్దాం_ఈ తాళాలు మీ దగ్గర వుంచండి. మరో సెట్ నా దగ్గర వుంది. మీరు సాయంత్రం రావాలనుకుంటే రండి. నాకు వీలుపడదు. రేపు కలుసుకుందాం."

సాలోచనగా తలూపాను, "నేనిక్కడేం చెయ్యాలి?"

"పత్రికలు చదవండి."

"చదివేశాను."

"అయితే ఒకపని చెయ్యండి_ఏదేనా వ్యాసం రాస్తారా?"

తెల్లమొహం వేసి చూశాను.

నవ్విందామె, "ఎవరికేనా ఉత్తరాలు వ్రాస్తారా?"

అడ్డంగా తలూపాను.

"అదీ చేతకాదా? అయితే ఏం చేస్తారు?"

"అకౌంటింగ్ అంటే నా కిష్టం."

"అలాగా? మరి చెప్పరేం?_అయితే ఒకపని చెయ్యండి సభ్యత్వం ముగిసిన చందాదారుల జాబితా తయారు చేస్తారా?"

ఉత్సాహంగా తలూపాను.

ఆమె ఓ లెడ్జర్ నా ముందు పడేసి, నవ్వి, "జాగ్రత్త మీరు మానసిక రోగి...తప్పుడు జాబితా తయారుచేసి నాకు తలనొప్పి తెప్పించకండి!" అంది.

ఆ తర్వాత ఆమె వెళ్ళిపోయింది.

నేను లెడ్జర్ తిరగేస్తూ కాసేపు గడిపాను.

ఇంతలో కడుపులో చురుక్కున మాడింది.

అది ఆకలి అని గ్రహించాను. కాబట్టి బయటికి నడిచాను.

# 4

సాయంత్రం ఆరుగంటలకి తిరిగి ఆఫీసుకొచ్చాను.

ఈ వూరికొచ్చి నేను రెండురోజులు కూడా కాలేదు. కానీ, పూర్తిగా మారిపోయాను. నీరజ వియోగంవల్ల గురయిన షాక్ నుంచి ఇంత త్వరగా కోలుకుంటాననుకోలేదు. మాధవి తండ్రి డాక్టర్ రఘునాథ్ ఇంతటి అందమైన సలహా యిస్తాడనుకోలేదు. ఇక్కడి ప్రశాంత వాతావరణం మనశ్శాంతికెంతో దోహదం చేస్తోంది.

ఇదివరకటి సోమరితనం ఇప్పుడు లేదు. శ్రద్ధగా కాలకృత్యాలు తీర్చుకుని, నీట్ గా తయారవుతున్నాను.

ఆఫీసులో నా టేబిల్ వెనక కూచోని లెడ్జర్ తెరిచాను. టేబిల్ మీద టైప్ రైటర్, తెల్లకాయితాలున్నాయి. ఒక కాయితం అందుకుని మాధవి అప్పగించిన పని పూర్తి చెయ్యడానికి ఉపక్రమించాను.

సుమారు గంట గడిచాక గదిలో చీకటి ముసురుకుంది. లైటు వెలిగించాను. తర్వాత సిగరెట్ వెలిగించి, విశ్రాంతిగా వెనక్కి వాలాను.

తలుపుదగ్గర అలికిడయింది.

తలెత్తి చూసి వులిక్కిపడ్డాను.

నేనే విషయమైతే పూర్తిగా మర్చిపోయానో, అదే యిప్పుడు నా యెదురుగా నిలిచివుంది—జానీ రూపంలో.

అతను జానీ అని నాకు తెలియకపోయినా, మాధవి చెప్పిన ఆనవాలు ప్రకారం అతనేనని వూహించుకున్నాను.

జానీని నేను వర్ణించడంకన్నా 'జూ'కెళ్ళి మీరు చింపాంజీని చూడ్డం మంచిది. చింపాంజీలయినా శుభ్రత పాటిస్తాయేమోగానీ, జానీ వొంటిమీద కంపు ఆరడుగుల దూరం నుంచి పసిగట్టవచ్చు. ఉంధాలపు వుస్తులతో,

తైలసంస్కారంలేని జుత్తుతో, దేహంమీద అంగుళం మందం జిడ్డుతో ... చూసేవాళ్ళకి డోకు వచ్చేలా వున్నాడు.

వాడి పిల్లికళ్ళలో క్రూరత్వం చూసి నా వొళ్ళు జలదరించిన విషయం వాస్తవం: కళ్ళు పిల్లివైనా చూపులు పులివి! చేతులు ఇనపకడ్డీల్లా, ఛాతీ రాతి పలకలా వున్నాయి... మొత్తానికి వాడి అవతారం చూస్తే యముడి ఏజెంటులా వున్నాడు.

వీడ్ని నేనెదుర్కోగలనా?

జానీ నా ముఖంలోకి చూసి అదోలా నవ్వాడు–ఎలుకను చూసి పిల్లి సంబరపడినట్టు. వాడి గారపట్టిన పళ్ళు నాకు జుగుప్స కల్గించాయి.

నేనూ నవ్వాను–బలహీనంగా.

వెంటనే నా నవ్వు మాయమైంది... గది బయట నడవాలో మరికొన్ని ఆకారాలు కన్పించాయి, చీకట్లో తచ్చాడుతూ.

పరిస్థితి బోధపడింది. ధైర్యం చూపిస్తే ఫలితం వుండవచ్చు–ఫలితం యెలాంటిదైనా నాకనవసరం! మాధవితో ఛాలెంజ్ చేశాను. ఇప్పుడు వాడో నేనో తేలిపోవాలి. వాడు లోనికొచ్చి నా యెదురుగా నిలబడ్డాడు.

నేను చిన్నగా నవ్వి, "వాళ్ళెవరు? నీ ఫ్రెండ్సా?" అన్నాను, గది బయటికి చూస్తూ.

వాడు తలూపాడు.

"సిగ్గుపడుతున్నారెందుకు? లోనికి రమ్మను!" అన్నాను.

జానీ అదోలా నవ్వాడు, "వాళ్లు పెళ్ళికూతుళ్ళను

కుంటున్నావా, సిగ్గుపడేందుకు? నీ శోభనం నేను చేస్తాను చూడు!''

''ఆశ్చర్యంగా వుంది! నాకు పెళ్ళెప్పుడయింది!''

''అదీ ఇదీ ఇప్పుడే అవుతాయి! చూడు పిరికి_ని ముఖం చూస్తోంటే నా వొళ్ళు మండిపోతోంది! వెధవ జోకులువేసి రెచ్చగొట్టకు!''

''ఏమిటీ! నేను పిరికివాడ్నా!''

''అవును!''

''సరే_నన్ను పిరికి అన్నావు_నిన్ను మురికి అంటాను_రైట్?''

వాడు తాపీగా నడుముకున్న బెల్టు వూడదీశాడు. నా గుండె ఝల్లుమంది ... బెల్టు అంచులకి మెరుస్తూ కన్పిస్తున్నాయి ముళ్ళు!

వాడు బెల్టు ఝళిపించి యికిలించాడు.

నేను తటాలున లేచి టైప్ రైటర్ ఎత్తుకున్నాను.

వాడు నవ్వాపేసి కలవరంగా చూశాడు.

''చూడు మురికీ! ఆ బెల్టు నా వొంటికి తాకిందా, ఈ టైప్ రైటర్ నీ ముఖానికేసి కొడతాను!''

ఈ మాటలు నేను ధైర్యంగా అంటున్నా, కాళ్ళు మాత్రం వణుకుతోనే వున్నాయి. నా మాటలు విని జానీ తీక్షణంగా చూశాడు. మా ఇద్దరికళ్ళు కలిశాయి. కొన్ని క్షణాలయ్యాక వాడదోలా నవ్వి తిరిగి బెల్టు నడుముకు బిగించుకోసాగాడు. నేను టైప్ రైటర్ పెట్టేసి కూచున్నాను.

వాడు జేబులోంచి సిగరెట్ కేసు తీసి ఒక సిగరెట్ వెలిగించాడు. ఆ కేసు నాదని గుర్తుపట్టాను.

''ఈ కేసు పోగొట్టుకున్నందుకు విచారించకు! ఈ

రాత్రికి యిక్కడనుంచి చెక్కేయకపోతే ప్రాణాలు పోగొట్టుకుంటావు!" అటేసి తిరిగి వెళ్ళిపోయాడు.

నేను కుదుటపడ్డాను.

వాడ్ని యింత ధైర్యంగా కంట్రోలు చేస్తాననుకోలేదు లేకపోతే నా వీపు వాతలు తేలేది. నా శక్తిని వాడు గ్రహించాడు—అందుకనే, కేవలం హెచ్చరికచేసి వెళ్ళి పోయాడు.

హఠాత్తుగా ఉలిక్కిపడ్డాను. నా శరీరం అవమానంతో కుంచించుకుపోయింది.

పిరికివాడ్ని!

వాడు నన్ను పిరికివాడన్నాడు!

నేనిక్కడ నుండి పారిపోయి నా పిరికితనం రుజువు చేసుకోవాలా?

ఇది నా ఆత్మాభిమానం ముమ్మాటికీ ఒప్పుకోదు.

వాడో నేనో తేలిపోవాలి... అంతే!

## 5

మర్నాడు ఉదయం.—

మాధవికంటే ముందు ఆఫీసుకు వచ్చి ఆమె చెప్పిన పని పూర్తి చేయసాగాను. ఇంతలో గుమ్మంలో అలికిడయింది. తలెత్తి చూసేంతలో, ఓ పదిహేనేళ్ళ కుర్రాడు ఓ గుడ్డు నా ముఖానికేసి విసిరికొట్టి పారి పోయాడు...

గుడ్డుపగిలి నా ముఖంమీద, బట్టలమీద, టేబిల్ మీదా చిమ్మింది. మాధవి వచ్చే సమయానికి శుభ్రం చేసేయ్యాలనుకున్నాను గానీ, సాధ్యం కాలేదు. ఆమె నా అవతారం చూసి గాభరాపడింది. దగ్గరికి వచ్చి

కాస్సేపు కళ్ళప్పగించి చూసింది. నేను బలహీనంగా నవ్వాను.

"ఏమిటిది? జానీ వచ్చాడా!" గర్జించిందామె.

తలూపాను.

"నాకు తెలుసు - వాడు మిమ్మల్ని సత్కరిస్తాడని! మిస్టర్ కమల్, ప్లీజ్ వెళ్ళిపొండి! మీరు వాడ్ని ఎదుర్కోలేరు! వాడ్ని రెచ్చగొట్టడం మంచిది కాదు! ప్రాణాలకి ముప్పు—"

"ఆగండి" అడ్డుతగిలాను, "నిన్న రాత్రి ఏం జరిగిందో తెలుసా?"

"ఏం జరిగింది?"

చెప్పాను—జానీ ఏ విధంగా వచ్చాడో, నేనే విధంగా ఎదుర్కొన్నానో, వాడెలా తిరిగి వెళ్ళిపోయాడో...

ఆమె ఆశ్చర్యంగా వింది.

"నేను నమ్మను! మీరు కల్పించి చెప్తున్నారు!".

నవ్వాను, "సరే, మీరేమీ నా గురించి భయపడకండి! ఆట ఇప్పుడే ప్రారంభమైంది ... రిజల్ట్ కోసం వేచి చూడండి. వాడో నేనో తేలిపోయేవరకు ఈ వూరు కదలను. ఈ వ్యవహారంలో మీ జోక్యం అనవసరం!"

ఆమె తలపట్టుకుని కాస్సేపు ఆలోచించింది.

ఆ తర్వాత టేబిల్ మీద కాగితాల్ని బ్యాగులో కుక్కింది.

"సరే మీ ఇష్టం—కానీ, నా ప్రతిష్ట, నా పత్రిక, నా ఆఫీసు వీటికేలాటి భంగం కలగనంతవరకు మిమ్మల్ని సహిస్తాను" అందామె.

"ఆ హామీ నేనిస్తాను" అన్నాను.

ఆమె తలూపింది. "నేనిప్పుడు ప్రెస్‌కి వెళుతున్నాను. మీరు వుంటారా?"

"ఉండను. స్నానం చెయ్యాలి" అన్నాను బట్టలు చూసుకుంటూ.

ఆ తర్వాత బయటికి వచ్చేశాం. నేను హోటల్‌కొచ్చి స్నానంచేసి బట్టలు మార్చుకున్నాను. భోజనంచేసి జానీ గురించి ఆలోచించడం ప్రారంభించాను. వాడ్ని నేను రెచ్చగొడుతున్నానని తెలుసు. అయితే వాడెలా రియాక్ట్ అవుతున్నాడు? హెచ్చరిక ప్రకారం నా ప్రాణాలు తీస్తాడా? నాకిప్పుడు ప్రాణభయం లేదు. నీరజ చనిపోయి నప్పుడే నాకు జీవితం మీద ఇంట్రెస్టు నశించింది.

నాతాత్తుగా నీరజ జ్ఞాపకంవచ్చి నాకు దుఃఖం ముంచుకవచ్చింది.

వెంటనే బయటికి వచ్చి ఆఫీసుకి బయలుదేరాను.

ఆఫీసుకి తాళం వేసివుంది.

మాధవి ప్రవర్తన నాకు వింతగా వుంది.

ఆమెకి ఆఫీసులోకంటె బయటి పనులే ఎక్కువ వున్నాయి. తెల్లారిలేస్తే అర్ధరాత్రివరకు ఆమె ఎక్కడెక్కడ తిరుగుతోందో ఏమేం చేస్తోందో నా కంతు బట్టటంలేదు—కానీ,ఆమె నిర్విరామంగా చేస్తోన్న సాంఘిక సేవకి ఆమెమీద నాకు గౌరవభావం యేర్పడింది.

ఆఫీసు తాళంతీసి లోనికెళ్ళాను.

ఆశ్చర్యం!

యుద్ధం జరిగాక రణరంగం ఎలా వుంటుందో అలా వుంది ఆఫీసు. ఫైళ్ళు, కాగితాలు, లెడ్జరు, ఉత్తరాలు, పత్రికలు చిందరవందరగా నేలమీద పడేసివున్నాయి. కుర్చీలు, టేబిళ్ళూ బోర్లా పడేసివున్నాయి.

ఆ దృశ్యం చూశాక నా గుండె వేగంగా కొట్టుకుంది- జానీ గురించి భయంవల్ల కాదు, ఈ క్షణంలో మాధవి వస్తే ఏం జరుగుతుందోనన్న కంగారువల్ల.

ఛటుక్కున లోనికి నడిచి మంచంమీద స్కేటింగ్ చేసినట్లు జారిపడ్డాను. తల గోడకి కొట్టుకుంది. నక్షత్రాలు కన్పించాయి. గట్టిగా మూల్గాను. అతిప్రయత్నం మీద లేచి కూచుని చూచాను-నా కాళ్ళదగ్గర అరటితొక్క వుంది.

నా ముఖం అవమానంతో ఎర్రబడింది. లేచి నిలబడి చుట్టూ చూశాను. నాదృష్టి అడ్డంగా పడేసివున్న బిల్ మీద పడింది.

దానిమీద ఒక చీటి అంటించివుంది: 'పిరికి, చెక్కేయ్'

నవ్వుకున్నాను. ఆ చీటీ పీకి చించేశాను. ఆ తర్వాత కర్తవ్యం గురించి గబగబ ఆఫీసు సర్దసాగాను. సమయం అయిదయింది. మాధవి ఏ క్షణంలోనయినా రావచ్చు. ఇలాంటి పరిస్థితిలో ఆమె వుగ్రావతారాన్ని చూస్తే తప్పకుండా ఈ వూరు వదలి పారిపోతానని నమ్మకంగా చెప్పగలను.

ఆఫీసుని పూర్తిగా యధాస్థాయికి తెచ్చేటప్పటికి గంట గడిచింది. అప్పుడు విశ్రాంతిగా సిగరెట్ వెలిగించి కూచున్నాను.

నేనిక్కడకివచ్చి మాధవికి సహాయ పడకపోగా, ఆమెని దెబ్బతీసే పరిస్థితులు కల్పిస్తూ కాలక్షేపం చేస్తున్నాను. లేదు! నేను తక్షణం ఏదో ఒకటి చెయ్యాలి! జానీ చేష్టలు మితిమీరకుండా బుద్ధిచెప్పాలి. ఇప్పటివరకు వాడు నామీద దాడిచేస్తూ వచ్చాడు. ఇకనుంచి నేను ఎదురుదాడి చెయ్యాలి!

టెలిఫోన్ మోగింది. రిసీవర్ ఎత్తాను.

"హాల్లో కమల్! ఏం చేస్తున్నారు?"

మాధవి కంఠం అది.

నేను ఉలిక్కిపడి తేరుకున్నాను. "ఏమీ లేదు..."

"నాకు తెలుసు మీరేమీ చెయ్యరని! రాత్రి నా యింటికివచ్చి భోజనం చేస్తారా?"

కలవర పడ్డాను. "ఎందుకు?"

"ఎందుకూ లేదు...ఒంటరిగా భోజనం చెయ్యాలంటే నాకు సయించదు."

ఇలాంటి ఆహ్వానాలు తిరస్కరించడం మంచిదికాదు.

"సరే వస్తాను. మీ రెక్కడున్నా రిప్పుడు?"

"ప్రెస్సులో. ఆఫీసుకి రావడం కుదరదు. యెనిమిది గంటలకి నాయింటికి రండి—కిన్నెరసాని థియేటర్ దగ్గరకి వచ్చి నా పేరు చెబితే, ఇల్లెవరయినా చూపిస్తారు. మరో విషయం—ఇంకా ఆఫీసులో యెందుకు వున్నారు. మూసేసి వెళ్ళిపోండి. కమల్, జానీ మళ్ళీ యేదయినా చేసాడా?"

జాగ్రత్తపడ్డాను. "లేదు."

"పోలీసు రిపోర్టివ్వడం మంచిదనుకుంటాను?" అంది ఆమె.

"అవసరం లేదు. ఎనిమిది గంటలకి వస్తాను. మీ అభిమానానికి థాంక్స్."

లైన్ కట్ చేసి లేచేను. ఆఫీసుకి తాళంవేసి తిరిగి హోటల్ కొచ్చాను. సమయం ఏడు కావస్తోంది. జానీ గురించి ఆలోచిస్తూ కొంతసమయం గడిపాను. వాడి చేష్టలు ఇక సహించను. ఈసారి వాడికి బుద్ధి చెప్పాలి.

వాడికి నేనుగాక నాకు వాడు భయపడేలా చెయ్యాలి. అందుకు నేను చాలా తెగించాలి ... ధైర్యం కావాలి, ప్రాణం ముఖ్యంకాదు.

# 6

ఎనిమిది గంటలకి మాధవి ఇంటికి వెళ్లాను.

ఆ ఇంట్లో ఆమె ఒంటరిగా వుంటోంది. అయినా జానీ ఆమె జోలికి రాకపోవడం గొప్ప విషయం. వాడామెను ఏదేనా చెయ్యకపోవడానికి కారణం, వూళ్ళో ఆమెకి వున్న పలుకుబడి కావచ్చు.

భోజనంచేస్తూ వివిధ విషయాలు మాట్లాడుకున్నాం. అప్పుడు నాకు నీరజగానీ, బాసుగానీ, జానీగానీ... ఎవరూ జ్ఞాపకం రాలేదు. మాధవిలో అన్నిటినీ మరిపించే శక్తి, ఆకర్షణా వున్నాయి.

పదిగంట లవుతుండగా ఆమెదగ్గర సెలవు తీసుకొని బయటకు వచ్చాను. వెళ్తున్నప్పుడు ఆమె జానీ గురించి పదేపదే హెచ్చరించింది.

నేను కారుడోర్ తెరిచి సీటుమీద ఏదో కాయితాన్ని చూశాను.

జానీ చేష్ట!

ఆ కాయితం అందుకుని చదివాను.

'ఇక్కడ ప్రేమకలాపాలు చాలా ప్రమాదకరం, చక్కీయ్!'

నా రక్తం సలసల మరిగింది. నరాలు బిగదీసుకుని పోయాయి. ఉద్రేకంతో విపరీతంగా వూగుతున్నాను... తలలో సుత్తిపోట్లు ప్రారంభమయ్యాయి. రెండు చేతులతో తలపట్టుకుని బానెట్‌కి జారగిలబడ్డాను.

మాధవి పరిగెత్తివచ్చింది. నేను ఛటుక్కున తేరుకుని

కాయితాన్ని చించేసాను.

"ఏం జరిగింది?"

"ఏమీ లేదు...తల నెప్పి..."

"కారెక్కండి—నేను వదిలి పెడతాను."

"పరవాలేదు, థాంక్స్."

కారెక్కి కూచున్నాను. స్టార్ట్ చేసి ఆమెని చూశాను, "తగ్గిపోతుంది. మీరు వెళ్ళండి. స్వీట్ డ్రీమ్స్."

ఆమె అదోలా వెనక్కి తిరిగాక కారు ముందుకు పోనిచ్చాను.

జానీ!

నా కాళ్ళు బలంగా ఏక్సిలేటర్ని తొక్కాయి.

ఈరోజు వాడికి మూడింది!

వాడు బకెట్ తన్నేలా నేను తన్నకపోతే ఆత్మహత్య చేసుకుంటాను!

హత్య! వాడ్ని హత్యచేస్తానా? నా వొళ్ళు గగుర్పొడిచింది...నాలో అంత క్రూరత్వం వుందా!

తటాలున స్పీడు తగ్గించాను.

ఎదురుగా—యాభైగజాల దూరాన ఒక మోటార్ సైకిల్ వెళుతోంది. దానిమీది ఆకారం స్పష్టంగా కనిపించడంలేదు. స్పీడు పెంచి ముఫ్ఫైగజాల దూరమెళ్ళాను.

వాడు జానీ!

స్పీడుగా డ్రయివ్ చేసి డాష్ ఇచ్చెయ్యనా?

హఠాత్తుగా వాడు ఒకవీధిలోకి తిరిగాడు. నేను వీధిమలుపులో కారాపి చూశాను. మోటార్ సైకిల్ నిర్మానుష్యంగావున్న వీధిలో వెడుతోంది...కొంత దూరం వెళ్ళాక ఒక పెంకుటింటి ముందాగింది. వాడుదిగి ఇంట్లోకి వెళ్ళాడు.

నేనలాగే కాచుకున్నాను. వాడెంతకీ బయటకి రావడము లేదు. నాకో ఆలోచన తట్టింది. వెంటనే కారుదిగి డిక్కీలోంచి ఒకటిన్ను తీశాను. కారు టాంకులోకొంత పెట్రోలు టిన్నులోనింపి వీధిలోకి నడిచాను.

నా బూట్లచప్పుడుతప్ప ఎక్కడా శబ్దంలేదు. దారిలో అక్కడక్కడ కొన్ని వీధికుక్కలు అరిచాయి. గబగబ నడచి జానీ ఇల్లు చేరుకున్నాను. చీకటిగా వుంది. లోన చప్పుడులేదు. కాస్సేపయ్యాక ఎవరిదో స్త్రీ కంఠం, ఆ తర్వాత జానీ కంఠం విన్పించింది. అప్పుడు బోధపడింది వాడెలాంటి చోటుకి వచ్చాడో.

ఇంటిముందు మోటార్ సైకిల్ ని చూశాను_డొక్కు BSA.

కసిగా నవ్వుకొని, టిన్నులోని పెట్రోలు బండిమీద పోశాను. అగ్గిపుల్ల వెలిగించి దానిమీదకి విసిరాను... భగ్గున మంటలేచింది.

చూస్తూండగానే మోటార్ సైకిల్ మంటల్లో పూర్తిగా దగ్ధమయిపోయింది. అప్పటివరకు నేనక్కడలేను. జానీ బయటకి వచ్చేలోపున కారు చేరుకున్నాను...

కారు స్టార్ట్ చేస్తూండగా వీధిలో జనం అరుస్తూ పరిగెత్తారు.

# 7

మర్నాడు ఉదయం ఆఫీసుకివస్తూ, ఇనపకొట్లో మూడడుగుల పొడవు కడ్డీ తెచ్చుకున్నాను.

దాన్ని నా టేబుల్ సొరుగులోదాచి మాధవి కోసం యెదురు చూడసాగాను. పదిగంటలయినా ఆమె రాలేదు. ఆఫీసులో పచార్లుచేస్తూ అప్పుడప్పుడు బాల్కనీలోంచి ఎదురుగా కిళ్ళీ కొట్టువేపు చూడసాగాను. జానీముఠా

అక్కడ కన్పించడం లేదు...

నేను అసహనంగా టేబిల్ దగ్గర కూచుని పిచ్చిగీతలు గీయసాగాను...సరిగా పదిన్నరకి జానీ ప్రవేశించాడు— వెనక ఏడుగురితో.

నాకు భయం వెయ్యలేదు. నా చెయ్యి సొరుగులాగింది.

వాడు క్రూరంగా చూసి, పళ్లునూరి, బెల్టువూడదీసేడు "నాబండి తగలబెడతావా? ఇప్పుడేం జరగబోతోందో తెలుసా, రాస్కెల్!"

నేను ఛటుక్కున నిలబడి కడ్డీతీశాను. వాడు దాన్ని చూసి రివ్వున చెయ్యెత్తి బెల్టుతో నా ఛాతీమీద కొట్టాడు. ఆ దెబ్బకి నేను తూలి కుర్చీలోపడి ఛాతీపట్టుకున్నాను...గుండె ఆగినట్లయింది... కడ్డీ చేతిలోంచి జారిపోతోంది...జానీ నన్ను చంపేస్తాడు!

హఠాత్తుగా నాకు శంకర్ జ్ఞాపకం వచ్చాడు!

శంకర్! సన్యాసి వేషంలో పొలాల్లో పడిమందిని...

ఇలాంటి పరిస్థితులో శంకర్ యెలా పోరాడతాడో వూహించుకున్నాను. అతని ఫోటో కళ్ళముందు మెదిలింది...టార్జానా? ఫాంటమా? సాంసనా? యెవరితో పోల్చాలి? ఎవరితో పోల్చినా అతని సాటికెవరూ రారు!

శంకర్ శక్తి సామర్థ్యాలు, ధైర్యసాహసాలు, నా మనసులో చకచక మెదిలాయి...అంతే! నాలో వూహకందని శక్తి వచ్చేసింది!

తటాలున లేచి కడ్డీతో విసురుగా జానీ ముఖంమీద కొట్టాను. వాడు భయంకరంగా అరిచాడు. వెంటనే వాడి అనుచరులు ముందుకు వచ్చారు. మరోదెబ్బ జానీ ముఖంమీద వేశాను. అంతే! వాడి గారపట్టిన రెండు పళ్ళువూడి నా టేబుల్ మీద పడ్డాయి.

వాడు ముఖం పట్టుకుని గావుకేక పెట్టి కిందపడ్డాను.

వాడి అనుచరులు నామీదకు లంఘించారు.

నేను శంకర్ని వూహించుకుంటూ, కడ్డీని చాకచక్యంగా తిప్పుతూ, వాళ్ళమీద పడ్డాను. వాళ్ళ ముఖాలు, కాళ్లూ, చేతులూ, తలలూ... నా యినపకడ్డీ రుచి చూస్తున్నాయి.

వాళ్ళు అరుస్తూ, గట్టిగా మూలుగుతూ, బయటకి పారిపోతున్నారు. నా వొంట్లో శక్తినంతా కూడదీసుకొని కడ్డీ తిప్పుతున్నాను...అలా ఎంతసేపు తిప్పానో తెలియదు. అలసిపోయాక చూస్తే ఎవరూ లేరు, నేలమీద వెల్లికిలా పడివున్న జానీతప్ప. వాడి తలదగ్గర రక్తం మడుగు కట్టింది.

ఛటుక్కునవంగి వాడి నాడి చూశాను; బ్రతికే వున్నాడు బాస్టర్డ్.

అప్పుడు కుదుటపడి సేద తీర్చుకున్నాను. శంకర్ని మనసులోనే అభినందించాను. ఈ ఘనకార్యం నాచేత శంకర్ అదృశ్యశక్తి చేయించింది. అతనికి నేనెంతో రుణపడివున్నాను.

హైద్రాబాద్ కెళ్ళినపుడు తప్పకుండా అతన్ని జైలుకెళ్ళి కలుసుకుంటాను నాకీ శక్తి ప్రసాదించినందుకు అతన్ని బిగియారా కౌగిలించుకుని అభినందనలతో ముంచేస్తాను.

జానీని చూశాను. వాడు తెలివితప్పి పడివున్నాడు. వాడి అవతారంచూసి నాకు అసహ్యం పుట్టింది. వాడి జేబులోంచి నా సిగరెట్ కేసు తీసుకొని, వాడి చెయ్యి పట్టి బయటికి ఈడ్చుకెళ్ళాను. పక్క ఆఫీసువాళ్ళనన్ను విచిత్రంగా, భయంగా చూశారు...

జానీని నడవాలో అలాగే ఈడ్చుకుంటూ వెళ్ళి మెట్ల మీద జారవిడిచాను. వాడు దొర్లుకుంటూ వెళ్ళి రోడ్డు మీద పడ్డాడు. జనం గుంపులుగా పరిగెత్తి వచ్చారు.

తిరిగి ఆఫీసులోకొచ్చి పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేశాను.

"హల్లో, ఇన్‌స్పెక్టర్ శర్మ హియర్" అంది అవతలి కంఠం.

"నేను కమలాకర్‌ని. 'విశ్వశక్తి' ఆఫీసునుంచి మాట్లాడుతున్నాను. ఆఫీసు మెట్లదగ్గర జానీ పడి వున్నాడు— తీసికెళ్ళండి."

"వాట్! వాడికేమయింది?"

"చావలేదు, జస్ట్ తెలివితప్పాడు, మెట్లమీంచి దొర్లి."

"మీరెవరు?"

"మాధవి అసోసియేట్‌ని."

"ఓ, అర్థమయింది. మిస్టర్, మీరక్కడే వుండండి. ఇప్పుడే వస్తాం" లైన్ కట్ అయింది.

నేను టేబిల్ ఎక్కికూచొని సిగరెట్ వెలిగించాను. టేబిల్ మీద జానీగాడి పళ్ళు కన్పించాయి. నాకసహ్యమేసి వాటిని ఒక అట్టముక్క సహాయంతో బయట పారేశాను.

పిరికివాడ్ని!

గర్వంగా నవ్వుకున్నాను. కాదు మొనగాణ్ని!

శంకర్! ఆజన్మాంతమూ నిన్ను గురువుగా పూజిస్తాను.

పావుగంటలో నా దగ్గరకి ఇన్‌స్పెక్టర్ వచ్చాడు.

"మీరేనా కమల్? ఏం జరిగింది? జాని ఏంచేశాడు?"

"బెల్టుతో నావీపు వాయించాలనుకున్నాడు. నేను బయటకు విసిరేశాను" అన్నాను.

ఆశ్చర్యంగా చూశాడతను, "వినిరేశాగా! అంత ధైర్యం ఎలా వచ్చింది?"

శంకర్ అదృశ్యశక్తి నన్నెలా ప్రేరేపించిందో చెప్పేయాలనుకున్నాను. కానీ, మానుకున్నాను.

"ఇన్ స్పెక్టర్, యిదంతా ఎలా జరిగిందో నాకే ఆశ్చర్యంగా వుంది!" అన్నాను.

"నాకూ అలాగేవుంది! వానికి దేహశుద్ధి చేయాలని మాకు చాలాకాలంగావుంది. కానీ కారణం కన్పించడం లేదు. మీరు మంచిపని చేశారు! దక్కకాటుకు చెప్పు దెబ్బ! వెరీగుడ్!"

"థాంక్స్."

"వాణ్ని హాస్పిటల్ కు తరలించాం. పరిస్థితి యెలా వుంటుందో చెప్పలేం, ఒకవేళ చస్తే మీరు చిక్కుల్లో పడతారు!" అన్నాడతను.

నేను భారంగా నిట్టూర్చాను. అతను నవ్వి వెళ్ళిపోయాడు.

మరుక్షణం తుఫానుగాలిలా జొరబడింది మాధవి.

ఆమె ఉగ్రావతారం నన్ను అదరగొట్టింది.

"కమల్! ఏమిటిది? నేనేం చెప్పాను!" అరిచిందామె.

"ప్లీజ్, శాంతించండి."

"షటప్! ఇది ఆఫీసా? దొంగలముఠా స్థావరమా! వాణ్ని—వాణ్ని—ఎందుకు కొట్టారు? మిమ్మల్ని చూస్తూ వుంటే... ఓహ్! వెళ్ళిపోండి యిక్కడనుంచి! మీరు కిరాతకులు! దుర్మార్గులు! మీలో రాక్షసత్వం వుంది."

"ఆగండి. వాడ్ని నేను కొట్టకుండా నాపై వాయించుకుంటే పాపం లేదికదూ?" అన్నాను.

"ఓహ్! మీరు శంకర్ కన్నా క్రూరంగా కన్పిస్తా

న్నారు! మిమ్మల్ని సహించలేను! ప్లీజ్ వెళ్ళిపొండి!"

"మాధవి నిజం చెప్పండి. ఒక ఘాతక మూకనించి ఈ వూరికి విముక్తి కలిగించినందుకు నామీద మీకలాటి అభిమానమూ లేదా?"

"ఏమిటి? మీరు మాట్లాడేది? వాడు భర్తే?"

"చావనీండి! మీరు విధిని నమ్ముతారా? వాడు నా చేతిలో చావాలనివుంటే చస్తాడు!"

"ఛీ ఛీ, మీరు హంతకులు! మిమ్మల్ని చూడలేను! వెళ్ళిపొండి! గెటవుట్!" ఆమె తలపట్టుకుని కూచుండి పోయింది.

నాకు నీరజ జ్ఞాపకం వచ్చింది.

మాధవి స్థానంలో ఆమెవుంటే నన్నెలా కౌగిట్లో బిగించి ఉక్కిరిబిక్కిరి చేసేదో వూహించుకున్నాను.

నా కళ్లలో నీళ్లు తిరిగాయి.

ఛటుక్కున వెనక్కి తిరిగి బయటకి వచ్చేశాను.

## 8

ఆ రోజంతా నా మనసు అస్తవ్యస్తంగా తయారయింది.

మాటిమాటికి నీరజ రూపం కళ్ళముందు మెదులుతోంది, మాధవి అరుపులు చెవుల్లో మార్మోగుతున్నాయి.

హోటల్ గదిలో పడుకుని అరగంటసేపు ఏడ్చాను. నీరజ తియ్యటికబుర్లు, నా బాస్ ఆత్మీయతతో కూడిన సలహాలు, మాధవి నన్ను అసహ్యించుకుంటూ వేసిన కేకలూ, జానీతో నా సంఘర్షణ...ఇవన్నీ నన్ను పిచ్చివాణ్ని చేశాయి.

ఇక యీ వూళ్లో వుండకూడదనిపించింది. ఇక్కడ వుంటే నేనింకా మానసికంగా దెబ్బతినే ప్రమాదముంది.

కాని, శంకర్ ఫోటో నాకెందుకో ధైర్యం చెప్తున్నట్టని పిస్తోంది. అతను నా ఎదురుగా కూచున్నట్టూ, నాకు అభయమిస్తూనట్టూ అన్పిస్తోంది.

శంకర్!

కిరాతకుడు! దుర్మార్గుడు! రాక్షసుడు!...అని చదివాను. మాధవి కూడా నన్ను శంకర్‌తోనే పోల్చింది...

శంకర్‌లోవున్న క్రూరత్వం నాలో వుందా? నన్ను చూసి చిన్నపిల్లలు జడుసుకుంటారా? శంకర్‌లాగే నేను కూడా పదిమందిని కలిపి కొట్టగలనా? ఇళ్ళకి నిప్పు పెట్టగలనా?

అకస్మాత్తుగా నాలో ఏదో మార్పు రాసాగింది.

శారీరకంగా కాదు—మానసికంగా.

నా ఆలోచన లిలా యెందుకు పరిగెడుతున్నాయో తెలీదు—ఏదో చేసెయ్యాలన్న తపన! వూహాకందని అనుభవాలకి లోనుకావాలన్న కోరిక! నా శక్తిసామర్థ్యాల్ని ఖచ్చితంగా అంచనా చేసుకోవాలన్న ఆలోచన! నా ధైర్యసాహసాలు శంకర్‌కేమాత్రం తీసిపోవని నిరూపించుకోవాలన్న ఉద్రేకం—నేరం చేసేటప్పుడు కలిగే భయాన్ని చవిచూడాలన్న కసి!

వెంటనే మరో ఆలోచన వచ్చింది.

పట్టుబడేంతవరకు ఎవరూ నేరసుడు కాడు!

నేనెందుకు పట్టుబడాలి? పట్టుబడకుండా శంకర్ ప్రభావంవల్ల నాలో పుట్టుకొచ్చిన బలహీనతల్ని, అదుపు చెయ్యలేని మానసికోద్వేగాన్ని, ఎందుకు చల్లార్చుకో కూడదు?

ఈ ఆలోచన వచ్చాక ఉద్రేకం తగ్గింది.

ఆందోళన తొలగి ఉత్సాహం చోటుచేసుకుంది.

చట్టవిరుద్ధ పన్లు చేస్తున్నప్పుడు శంకర్ యెలాటి అను

భవానికి లోనవుతాడో, అలాటిదే నాకూ కావాలి.

అంతే! ఇది నా అంతిమ నిర్ణయం!

ఇలాటి ఆలోచనలతో పగలంతా గడిచిపోయి చీకటి పడింది. సమయం ఎంతయిందో తెలియలేదు. ఆకలి వేస్తున్నప్పుడుగానీ ఆలోచనల నుంచి బయటపడలేక పోయాను. భోజనం చేస్తూకూడా నా బలహీనతల్ని ఎలా తీర్చుకోవాలా అని ఆలోచించసాగాను.

ఇంతలో ఫోను మోగింది.

రిసీవర్ ఎత్తాను.

నన్నాశ్చర్యపరుస్తూ అవతలి నుంచి నర్సు కంఠం పరిచయం చేసుకుని అంది, "మీరు కమలాకర్ కదూ? మిస్టర్ కమల్, మాధవి మెట్లమీంచి జారి గాయపడింది."

"ఏమిటీ!" అరిచాను.

"ప్రమాదమేమీ లేదు. ఇంట్లో డాబా యెక్కుతూ తూలిపడింది. ఎడమకాలు ఫ్రాక్చర్ అయింది. కంగారు పడకండి!"

"ఎక్కడుందామె?"

"ఇక్కడేవుంది-నేను సరోజినీ నర్సింగ్ హోం నించి మాట్లాడుతున్నాను."

"నేను వెంటనే వస్తున్నాను."

"సారీ. ఇప్పుడామెని చూడకూడదు. క్లోరోఫాం యిచ్చాం. రేపుదయం రండి" లైను కట్ అయింది.

నాకేమీ చేయడానికి పాలుపోలేదు.

ఇలా ఎందుకు జరిగింది?

ఈ నెల రోజులనుంచీ నేనిలాటి దుర్వార్తల్ని ఎందుకు వింటున్నాను?

ఏమీ ఆలోచించలేకపోయాను,

సమయం పది దాటింది.

బారులో కెళ్ళి బీరు తాగాలనిపించింది.

కారులో కాకుండా కాలినడకన బయలుదేరాను.

నా చూపులు రోడ్డుమీద కాక పక్క చీకటివీధుల్లో వున్నాయి. అప్రయత్నంగా ఓ వీధిలోకి తిరిగి చకచక నడవసాగాను. ఇంతలో హఠాత్తుగా ఎక్కడినుంచో వూరకుక్క వచ్చి నా వెంటపడింది. భయంకొద్దీ వేగంగా వురికాను. కుక్క అరుస్తూ తరుముతోంది. దాని కంద కుండా కొంతదూరం పరిగెత్తాక, ఎదురుగా ఒక బీట్ కానిస్టేబిల్ కన్పించాడు. నేను సందేహించకుండా అతని లాఠీ లాక్కుని దవడమీద గుద్దాను. అతను కీచుమన్నాడు నేను పరుగు లంకించుకుని హోటల్ కొచ్చి పడ్డాను .

నాకు తృప్తికల్గింది. నేరం చేస్తున్నప్పుడు కలిగే భయాందోళనల్ని అనుభవించాను. సులభంగా నిద్ర పట్టింది.

మర్నాడు వుదయం లేచి వుషారుగా నర్సింగ్ హోమ్‌కి బయలుదేరాను.

మాధవి బెడ్ మీద పడుకుని వుంది. నన్ను చూసి కళ్ళు పెద్దవయ్యాయి. పెదవులు విచ్చుకున్నాయి. చిరునవ్వు వెలువడింది.

నేను సంతోషించాను. ఆమెపక్కన కుర్చీలో కూచుని విష్ చేశాను.

"కమల్, మీరొస్తారనుకోలేదు! మిమ్మల్ని తిట్టాను! దుర్భాషలాడాను! బాధపడి వెళ్ళిపోయారనుకున్నాను" గొణిగిందామె.

"తిట్లు నాకు కొత్తకాదు_నా శాప్ తిట్లు మీకు డిక్షనరీలో కూడ దొరకవు" అన్నాను.

నవ్విందామె.

"కాలెలా వుంది?" అడిగాను.

"ఫరవాలేదు. నా గురించి దిగులుపడకండి! వేరే విషయాలు మాట్లాడుకుందాం, జానీ ఏమయ్యాడు?"

ఆ విషయం అప్పటివరకు నాకు తట్టలేదు.

అయితే, ఇన్‌స్పెక్టర్ మళ్ళీ నన్ను కలవలేదు కాబట్టి వాడి పరిస్థితి మెరుగయి వుండవచ్చు అనుకున్నాను.

ఈ విషయం మాధవితో చెప్పాను.

ఆమె కళ్ళు మూసుకుని, "భగవాన్! రక్షించావు!" అంది.

నేనేమీ అన్లేదు.

"మీరిప్పుడేం చేస్తారు" అడిగిందామె.

ఆలోచించాను. తాళంచెవులు నా దగ్గరే వున్నాయి.

"మీ కభ్యంతరం లేకపోతే ఆఫీసులో కూచుంటాను" అన్నాను.

"చాలా సంతోషం. నన్ను అర్థంచేసుకున్నందుకు చాలా థాంక్స్."

"ఇక వెళ్ళనా?"

తలూపిందామె.

## 9

నేను ఆఫీసుకి తిరిగివచ్చాక ఇన్‌స్పెక్టర్ నుంచి ఫోను వచ్చింది. జానీ పరిస్థితి ఫరవాలేదని చెప్పాడతను. అతను మెట్లమీంచి జారాడని తనకి నమ్మకం కలగడం లేదన్నాడు. వాడి ముఖంమీద దేనితోనో కొట్టివుండాలనీ, రెండు పళ్ళు కన్పించడంలేదనీ చెప్పాడు. నేనేమీ అన్లేదు.

ఆ రోజంతా యెప్పుడు చీకటి పడుతుందా అని

ఆలోచించసాగాను. చీకటి పడ్డాక నా కార్యక్రమం ఏమిటో కూడ నిశ్చయించుకున్నాను.

రాత్రి పదిగంటలకి బయటికి వచ్చి రోడ్డుమీద చూశాను. గతిరాత్రి సంఘటన జ్ఞాపకం వచ్చి ఉత్సాహంగా అటూ ఇటూ చూసాను-ఎలక్ట్రిక్ పోల్ కింద, నిర్మానుష్యంగావున్న ప్రదేశంలో, వంటిరిగా కునికిపాట్లు పడుతున్నాడు సోడావాడు.

నన్నెవరూ గమనించడంలేదని తెలుసుకుని, అడుగుల చప్పుడు కాకుండా నెమ్మదిగా వెళ్ళి వాడి వెనక నిలబడ్డాను. గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. కాళ్ళు గజగజ వణికాయి. ఇదే!... ఈ అనుభవమే నాక్కావాలి!

విసురుగా చెయ్యెత్తి వాడి మెడమీద కొట్టి, బండిలోంచి రెండుబుడ్లు తీసుకుని వురుకుతూ-వాటిని రోడ్డుకేసి విసిరికొట్టాను. పెద్దగా శబ్దంచేస్తూ పేలాయి.

ఇంతలో ఎదురుగా ఓ వ్యక్తి కన్పించాడు. ఆలస్యం చెయ్యకుండా అతనిమీద మెరుపుదాడి చేసి, రిస్టువాచీ లాక్కున్నాను. నా భయం యిప్పుడు రెట్టింపయింది. శక్తినంతా కూడదీసుకుని పరిగెడుతూ, వాచీని మురికాల్వలోకి విసిరాను.

తిరిగి నేను హోటల్ కి వచ్చాకగానీ కుదుటపడ్లేదు. నాకిప్పుడు చాలా తృప్తిగావుంది! సోడాబుడ్లను పగలగొట్టాను—ఇద్దర్ని గాయపర్చాను—రిస్టువాచీ నాశనం చేశాను-ఇదంతా చేస్తున్నప్పుడు విపరీతమైన భయానికి లోనయ్యాను! నాకిప్పుడెంత తృప్తిగావుంది!

కానీ-ఆ తృప్తి ఎంతోసేపు నిలువలేదు! నేను చేసిన పనుల్ని విమర్శించుకుంటే అది చాలా తక్కువన్పించింది.

శంకర్ రైఫిల్ లాక్కుంటే నేను లాఠీ లాక్కు-

న్నాను. శంకర్ సోడాబుడ్లు మనుషులమీద విసిరితే నేను కొడుకేసి కొట్టాను.

నేనెందుకిలా తెలివితక్కువగా ప్రవర్తించాను?

నిజంగా నాలో ధైర్యం లేదా?

పిరికి!

జానీ అవహేళన నా చెవుల్లో మారుమ్రోగింది.

నా శరీరం అవమానంతో కుంచించుకుపోయింది.

నేను పిరికివాడ్నా! అవును! జానీ సరిగానే చెప్పాడు!

మరుక్షణం నా ఆత్మాభిమానం మేల్కొంది. కాదు! నేను పిరికివాడ్ని కాదు! నాకూ శంకర్ ధైర్యసాహసాలున్నాయి! నిరూపించుకుంటాను! అందుకేదయినా చేయడానికి తెగిస్తాను!

ఆ తర్వాత రాత్రంతా రేపురాత్రి కార్యక్రమం గురించి ఆలోచించాను–పటిష్టమైన పథకం–శంకర్ కేమాత్రం తీసిపోకూడదు!

మర్నాడు వుదయం మాధవిని కలుసుకుని క్షేమ సమాచారాలు తెలుసుకున్నాను. ఆ తర్వాత తిరిగి హోటల్ కొచ్చి రిసెప్షనిస్టుతో మాట్లాడాను. కోదాడు కాక, ఖమ్మంకి దగ్గరలో 60 కి.మీ.ల దూరాన కొత్తగూడెం వుందని చెప్పాడతను. టౌన్ పెద్దదే. అన్ని సౌకర్యాలూ లభిస్తాయి. రెండుగంటల ప్రయాణం.

నేనొక నిశ్చయానికి వచ్చి ప్రయాణమవుతుండగా, ఇన్‌స్పెక్టర్ నించి ఫోన్ వచ్చింది. అవతలినుంచి అతని మాటలు నన్ను కలవర పెట్టాయి.

ఊళ్ళో ఎవడో ఆగంతకుడు తిరుగుతున్నాడట. రాత్రి పూట చెడ్డపనులు అనలేని కొంటెపనులు చేస్తున్నాడట. మొన్న రాత్రి కానిస్టేబిల్‌నీ, నిన్న రాత్రి మరో యిద్దర్నీ

కొట్టి, వాచీ, సోడాబుడ్లు, నాశనం చేశాడట. అయితే వాడెవ్వరూ గుర్తించలేదట.

మరో అనుభవం యిది! భయమూ, ఆ భయంలోంచి తృప్తీ అనుభవించాను.

అయితే ఈ విషయం నా కెందుకు చెప్పాడని అడిగాను. నన్ను ఈ వూళ్లోనే వుండిపోయి. తుంటరివెధవలకి బుద్ధి చెప్పమన్నాడతను.

మరి నేనుచేసే పనులకి బుద్ధి చెప్పేదెవరు? - అని ఆలోచించాను.

అలాగే చేస్తానని అతని కోరికను మన్నించాను.

ఆ తర్వాత కొత్తగూడెం బయలుదేరాను.

మధ్యాహ్నం అవుతుండగా అక్కడికి చేరుకుని త్వర త్వరగా పన్లు ముగించుకున్నాను —

ముందుగా ఫ్యాన్సీ షాపులో ఒక ఏర్ బ్యాగు, నల్లటి కళ్ళజోడు రెడీమేడ్ షాపులో నల్లటి పొడుగుచేతుల బనియన్-చెప్పుల షాపులో కాన్వాస్ బూట్సు-ఆట వస్తువుల షాపులో ఒక బొమ్మపిస్తోలు మొదలైనవి ఖరీదు చేశాను.

ఆ తర్వాత భోజనంచేసి, మేకప్ వస్తువు లమ్మే షాపులో-గుబురు మీసాలు, గడ్డం తీసుకున్నాను.

సాయంత్రానికల్లా తిరిగి ఖమ్మం చేరుకుని మాధవిని చూశాను. ఆమె వారంరోజులు నర్సింగ్ హోంలోనే వుండాలట. ఇది నా పనులకి ఎంతో అనువుగా తోచింది. మరికొన్ని పుస్తకాలూ మొకందించి, రాత్రి హోటల్ కొచ్చాను. భోజనంచేసి నా పథకం మళ్లీ ఆలోచించాను. ఎక్కడా పొరపాటు లేదు!

తృప్తిచెందింది. ఏర్ బ్యాగులో ఖరీదుచేసిన వస్తువులే గాక, టార్చిలైట్, ముఖం చూసుకునే అద్దంకూడ వేసుకున్నాను. గంటసేపు అసహనంగా కాచుకుని, సరిగ్గా 11 గంటలకి బయలుదేరాను.

బ్యాగు పట్టుకుని రోడ్డుమీద చకచక నడిచాను. వైరారోడ్డుమీద వూరు చివరికి చేరుకోవాలి. పావుగంట నడిచి పూర్తిగా వూరు దాటేశాను. ఆ తర్వాత ఒక చెట్టుక్రింద నిలబడి చూశాను. ఎక్కడా ఎవ్వరూ లేరు. నిర్మానుష్యంగా వుంది. చంద్రుడు లేడు. చీకటిగావుంది. ఈ చీకటి నాకు బాగా ఉపయోగపడుతుంది.

గబగబ షర్టువిప్పేసి బ్యాగులోంచి నల్లబనియన్ తీసి తొడుక్కున్నాను. ఆ తర్వాత బూట్స్ తొడుక్కుని, టార్చిలైటు-అద్దం సహాయంతో మీసాలూ, గెడ్డం అతికించుకున్నాను, కళ్ళజోడు పెట్టుకుని అద్దంలో ప్రతిరూపం చూసుకున్నాను—తృప్తి కలిగింది. నన్నెవరూ గుర్తించలేరు.

ఆ తర్వాత లేచి నిలబడి కుడివేపు చూశాను.

ట్యూబ్ లైట్స్ వెలుగులో స్పష్టంగా కన్పిస్తోంది— పెట్రోలు బంకు.

నవ్వుకుని బ్యాగులోంచి బొమ్మపిస్తోలు తీశాను.

చకచక నడిచి పెట్రోలు బంకు చేరుకున్నాను. ఏ వేనా వాహనాలు వచ్చేలోపున పని ముగించుకోవాలి!

కేబిన్‌లో, అద్దాల తలుపులోంచి, కునికిపాట్లు పడుతూ కన్పించాడు అటెండర్.

నేను తలుపుమీద చప్పుడు చేశాను. అతను తేరుకోలేదు. నెమ్మదిగా తలుపు నెట్టాను. కొద్దిగా తెరుచుకుంది.

పూర్తిగా సైట్టి లోనికి ప్రవేశించాను. అతనింకా తేరుకోలేదు.

పిస్టల్ గురిపెట్టి, "హాల్డప్!" అరిచాను, కర్కశంగా.

అతను అదిరిపడి లేచాడు. నన్ను చూసి అరవబోయాడు.

"అరవకు! నా చేతిలో పిస్టల్ వుంది – నీ పెట్టెలో డబ్బు వుంది–తీయ్!" అన్నాను.

అతని పెదవులు వణికాయి, "నువ్వు... నువ్వు... ఎవరు?"

"నక్సలైట్ ని. డబ్బు తీయ్!"

ఆలస్యమవుతున్న కొద్దీ నాకు ఆత్రుత యెక్కువవుతోంది.

"నన్ను చంపకు!" అరిచాడతను.

"డబ్బు తీయ్!" మళ్ళీ అరుస్తూ, అతని దగ్గరికి జరిగి. నా పిస్టల్ మీద అతని కనులు పడ్డాయ్.

"డబ్బు...డబ్బు లేదు!"

"పిచ్చిగా మాట్లాడకు! ప్రాణాలు పోతాయి!"

"నిజంగా డబ్బు లేదు__ప్రొప్రయిటర్ తీసికెళ్లాడు" వణుకుతూ ఇనప్పెట్టె తెరిచి చూపించాడు. ఖాళీగా వుంది. నేను చెయ్యిపెట్టి కలికాను. మరో చేతిలో పిస్టల్ అతనికి గురిపెట్టాను.

అంతే!

క్షణంలో వెయ్యోవంతు కాలం కేబిన్ లో కనులు చెదిరే వెలుగు ఆక్రమించుకుంది!

నేను అదిరిపడి విసురుగా చేత్తో అతని ముఖంమీద కొట్టాను. అతనుతూలి కుర్చీలో పడ్డాడు. ‘ ’స్యం

చెయ్యకుండా వెనక్కి తిరిగి బయటకు వురికాను. శక్తి కొద్దీ పరిగెత్తాను. పరిగెడుతూ మీసాలు, గడ్డమూ తీసి పారేశాను.

బ్యాగులోంచి షర్టుతీసుకుని, బ్యాగును దూరంగా విసిరాను. అలా వురుకుతూనే బనియన్ కూడా తీసిపారేసి షర్టు తొడుక్కున్నాను.

పదినిముషాలలో హోటల్ కి తిరిగివచ్చి బెడ్ మీద కూలబడ్డాను.

శరీరం నిలువునా కంపించిపోతోంది. ఏం జరిగిందో అర్థంగావడంలేదు!

ఏమిటది?

కళ్ళుచెదిరే మెరుపేమిటి? ఆకాశంలో మెరుపా? లేక ఎలక్ట్రిక్ తీగల లూజ్ కాంటాక్టా?

తల దిమ్మెక్కుతోంది!

నేనెందుకు పారిపోయి వచ్చాను? పటిష్టమైనపథకం వేసుకొని చివరి క్షణంలో పిరికివాడిలా యెందుకు ప్రవర్తించాను?

జానీ అవహేళన మరలా నా చెవుల్లో మార్మోగింది.

అబ్బా! వాడి హేళన సహిస్తూ నేనింకా యెందుకు బ్రతికి వున్నాను!?

అడుగడుగున నాపిరికితనం నిరూపించుకుంటూ ఎందుకు బ్రతుకుతున్నాను? ఇంతకంటే చావు మేలు!

ఆత్మాభిమానం వుంటే చచ్చిపో!

హఠాత్తుగా ఆత్మహత్య చేసుకోవాలన్న కోరిక కలిగింది.

అవును. నేనీ లోకంలో వంటరిగా బ్రతకలేను! నీరజ కావాలి! ఆమెను చేరుకోవాలి! ఆమెతో గడపాలి! ఐతే ఆమెనెలా చేరుకోవాలి?

హోటల్ మీంచి దూకెయ్యనా? కింద ఎవరైనా వుంటే అకారణంగా చస్తారు.

లారీకింద తలపెట్టనా? డ్రైవర్ చిక్కుల్లో ఇరుక్కుంటాడు.

ఉరిపోసుకు చావనా? గదిలో తాడెక్కడా లేదు.

గొంతు కోసుకుని ప్రాణం విడువనా? — కత్తి లేదు, బ్లేడ్లుకూడా అయిపోయాయి.

విషం తిని చావనా? నా దగ్గర తలనెప్పిమాత్రలు తప్ప ఏమీ లేవు.

అప్పుడొచ్చిందొక ఆలోచన —

రైలుకింద తలపెట్టాలి! అవును! ఇది సరయిన ఆలోచన!

హఠాత్తుగా టెలిఫోన్ మ్రోగింది.

ఆశ్చర్యపోయి తేరుకున్నాను — మళ్లా యేం కొంప మునిగింది?

రిసీవర్ ఎత్తాను.

"కమల్! మైబాయ్!" అది నా బాస్ గొంతు, "ఎలా వున్నావు? నిన్ను చూడకుండా నేనుండలేక పోతున్నాను!"

నేను కలవరపడ్డాను. "బాస్! మీరా! నేను బాగనే వున్నాను."

"అదే నేను కోరుకునేది! వెల్, బాయ్! నన్ను మర్చిపోలేదు కదా?"

"లేదు బాస్."

"గుడ్ — అయితే వెంటనే వచ్చెయ్!"

"బాస్?"

అవతల పెద్దగా నవ్వు, "యూ లిటిల్ బాస్టర్డ్! వెంటనే బయలుదేరి వచ్చెయ్. ఉదయం నేను ఢిల్లీ వెళు

తున్నాను_రెండురోజుల వరకూ రాను. నువ్వు ఆఫీసు మేనేజ్ చెయ్యాలి! మోస్ట్ ఇంపార్టెంట్ మైబాయ్!"

ఏం చెప్పాలో తోచలేదు.

"మాట్లాడవేం? బాధపడుతున్నావా? నెవర్ మైండ్! నేను తిరిగివచ్చాక నువ్వు వెళ్ళిపోవచ్చు. ప్లీజ్ కం అండ్ హెల్ప్ మీ!"

"అలాగే బాస్" అని పెట్టేశాను.

ఆ తర్వాత తలపట్టుకుని కూచున్నాను.

# 10

మర్నాడు మధ్యాహ్నం హైదరాబాదులో, నా బాస్ ఆఫీసులో వున్నాను.

నాకేమీ పాలుపోవడంలేదు. తను పిలిచినా నేను రాలేదని తెలిస్తే బాసు తలతిరిగి మూర్ఛపోతాడని వచ్చాను తప్ప, ఖమ్మం విడిచి రావడం నాకేమీ ఇష్టం లేదు.

వచ్చేముందు మాధవిని కలిశాను. ఆమె చాలా బెం పడింది. రెండు రోజుల్లో తప్పకుండా వచ్చేయాలని పదే పదే చెప్పింది. వస్తానని ప్రమాణం చేశాను. ఆ తర్వాత అయిష్టంగా ప్రయాణమయ్యాను.

ఇప్పుడు__నా ఎదురుగా టేబిల్ పైన పడున్న ఫైళ్లూ లెడ్జర్లు, కాయితాలూ...నన్ను పిచ్చివాడ్ని చేస్తూ వున్నాయి. అంతకుముందు వచ్చిన బిజినెస్ మనుషుల్తో దురుసుగా మాట్లాడాను. వాళ్ళు కసురుకుని వెళ్ళి పోయారు__నేనేదీ పట్టించుకోకుండా తటస్థంగా కూచు న్నాను.

నా బాసు రెండురోజుల తర్వాత వస్తానని చెప్పాడు. అప్పటివరకు ఈ ఆఫీసు నాదు జైలుగది. హఠాత్తుగా

నాకు ఖమ్మం వాతావరణం జ్ఞాపకం వచ్చింది. అక్కడ నేనెంతగా మారిపోయాను!

ఎలాగయితే నేం—అయిదుగంటల వరకు అసహనంగా గడిపి, ఆఫీసుమూసి బయటపడ్డాను.

ఇంటికెడుతున్నప్పుడు నాకు నీరజ జ్ఞాపకమొచ్చింది.

పూర్ లవర్! ఆమె కన్న కలలన్నీ నా కనులముందే నిర్దాక్షిణ్యంగా తుడిచిపెట్టుకుపోయాయి.

ఇంట్లో కారాపి దిగాను.

జేబులోంచి తాళంచెవులు తీసి మెట్లెక్కాను. నా కాశ్చర్యం వేసింది. తలుపుకి తాళంలేదు—గడియకూడా పెట్టలేదు.

పట్టపగలే దొంగతనమా!

గాభరా పడ్డాను. ఆత్రంగా తలుపు నెట్టాను.

అప్పు డెదురుగా చూసిన దృశ్యం నాలో ఎంత కలవరపాటునీ, భయాన్నీ కలిగించాయో నేను చెప్పడంకంటే స్వయంగా మీరనుభవించడం మంచిది.

మీరు ఇంటికెళ్ళి తలుపు తెరిచి లోపల చిరుతపులిని చూస్తే ఎలా ఫీలవుతారు? ఏం చేస్తారు? నాకు తెలియదు.

కానీ—చిరుత పులికంటే అతి ప్రమాదకరమయిన శంకర్‌ని నా ఎదురుగా చూసి ప్రాణాలెగిరి పోయాయి.

"నా పేరు శంకర్. నీ పేరు కమలాకర్ కదూ—కమల్ అని పిలిపించుకోడం నీకిష్టం—అవునా?"

నా వొంటిమీద తేళ్ళూ జెర్రులూ పాకాయి...

కర్కశమైన కంఠం!

"కమాన్ మిస్టర్! ఇలా వచ్చి కూచో. మనం మిత్రులం అవునా?"

నాకు తెలియకుండానే నేను లోనికి నడిచి అతని కెదురుగా కూచున్నాను.

"నీకోసం ఆఫీసుకి రావాలనుకున్నాను-కానీ, ఇది టాప్ సీక్రెట్! యింట్లోనే మాట్లాడాలనుకుని యిలా వచ్చాను..."

అప్పుడు చూశాను అతన్ని తీక్షణంగా.

మాధవి ఆఫీసులో చూసిన ఫోటోకీ, ఇప్పుడు నా ఎదురుగా కూచున్న శంకర్‌కీ కొంత తేడావున్నా-అది పెరుగుతున్న కాలం, తరుగుతున్న ఆయువు ప్రభావం.

కాకీదుస్తుల్లో, కాళ్ళకి బూట్స్‌తో, ఠీవిగా కూచోని వున్నాడు. ఎడమ చేతిలో కొన్ని బటానీలు వేసుకుని ఒకోక్కాగింజ తింటున్నాడు.

తేరుకుని పరిస్థితి గ్రహించాను.

నాకంతా అయోమయంగా వుంది!

ఇలాటి అనుభవాలు అందరి జీవితాల్లోనూ వుంటాయా?

విచిత్రం! నేను మనసులోనే వూహించుకుంటున్న శంకర్ నా కళ్ళముందు సాక్షాత్కరించడమేమిటి?

మా ఇద్దరి మధ్యా పూర్వపరిచయం లేదు మరి 'మిత్రులం' అంటాడేమిటి? నేనతనికి ఎలా తెలుసు?

శంకర్ నన్ను కలుసుకోడంలో వున్న మర్మం ఏమిటి?

"కమల్, నువ్వు చాలా ధైర్యవంతుడివి!" అన్నాడతను.

మరోసారి తేరుకున్నాను, "అవును...అవును..." అని గొణిగాను.

"అంతే కాదు, తెలివిగలవాడివి!"

"అలాగా?"

"అవును. అందుకే నువ్వు నాకవసరం. కమల్! నీ ధైర్యసాహసాలకి ప్రత్యక్ష నిదర్శనం నా జేబులో వుంది..."

తికమకపడ్డాను, "ఏమిటవి?"

అతను జేబులోంచి చిన్న పొట్లం తీశాడు. దాన్ని విప్పి టీపాయ్ పైన వుంచాడు.

నా గుండె ఝల్లుమంది! వెన్నులోంచి చలి పుట్టుకొచ్చింది!

టీపాయ్ మీద గారపట్టిన రెండు జానీపళ్ళు!

"ఇవి-ఇవి నీకెక్కడివి!" అర్చాను.

"'విశ్వశక్తి' ఆఫీసుముందు దొరికాయి" తాపీగా అన్నాడతను.

నా గుండెలో న్యూట్రాన్ బాంబు పేలింది.

"నువ్వు ఖమ్మంకెలా వచ్చావు? — జైల్లో వున్నావు కదా?"

"జైల్లోనా! ఏమిటి కమల్! జీవితాంతం నన్ను జైల్లోనే వుండిపొమ్మంటావా?"

"అంటే? తప్పించుకుని వచ్చావా?"

"ఛ! అలాంటి పని చెయ్యను. చట్టాన్ని గౌరవిస్తాను. మూడు నెలల క్రితం విడుదలై వచ్చేశాను."

"అయితే ఖమ్మం ఎందుకు వెళ్ళావ్? ఇప్పుడిక్కడి కెందుకొచ్చావ్!"

శంకర్ నిట్టూర్చాడు, "అదో పెద్దకథ! నేననుకున్న కార్యం సాధించడానికి యింత పెద్ద ప్లాను కావలసి వచ్చింది."

నా రక్తం వురకలు వేసింది, "శంకర్! ఏమిటి నీ వాగుడు?"

నాకేసి సూటిగా చూశాడతను, "గాభరాపడకు! శ్రద్ధగా విను. నా ప్లాను విని, న్యాయమైన నిర్ణయం తీసుకుని కృతజ్ఞతగలవాడి వనిపించుకో! నువ్వు తీసుకోబోయే

నిర్ణయం మీద నీ భవిష్యత్ ఆధారపడి వుంది_నీ లైఫ్‌ని ఆటో యిటో తేల్చిపారేసే నిర్ణయం_నువ్వు తప్పకుండా నేనాశించే నిర్ణయమే తీసుకుంటావని నా నమ్మకం."

నా ముఖం చెమటపట్టింది.

శంకర్ మళ్ళీ అన్నాడు, "నా పథకం పారాలంటే నిన్ను ట్రాప్‌లో యిరికించి నా చెప్పుచేతల్లో వుంచుకోవాలి. కాబట్టి ఏ కాల్‌గర్ల్‌నైనా నీకు పరిచయం చేసి నా వలలో బిగించాలనుకున్నాను. కానీ, పరిస్థితి అందుకు అనుకూలంగా లేదు. డార్లింగ్‌ని పోగొట్టుకుని నువ్వు దుఃఖిస్తున్నావు. నువ్వు కాల్‌గర్ల్ వల్లోపడ్డం అసాధ్యం కాకపోయినా చాలాకాలం పట్టవచ్చు. అంతకాలం ఆగే పథకం నాదికాదు__నా బి. పి. రోజురోజుకీ పెరిగిపోతోంది.

"ఈ పథకం పదిహేను రోజులక్రితమే నాకు తట్టింది. ఇది పారాలంటే నీ సహాయం కావాలి. నిన్నేదైనా ట్రాప్‌లో యిరికిస్తే సహాయం చేస్తావని తెలిసినా, ఎందులో యిరికించాలో తోచలేదు. ఆలోచనలతో తల బద్దలు చేసుకుంటుండగా, డాక్టర్ సలహామీద నువ్వు ఖమ్మం వెళుతున్నట్టు తెలిసింది. నేను వెంటనే నీ వెనుక మారువేషంలో బయలుదేరాను_గుడ్డిగా, ఒక నిర్దిష్టమైన లక్ష్యం లేకుండా."

కాస్సేపాగి మళ్ళీ అన్నాడు శంకర్ :

"ఖమ్మంలోవున్న నాలుగురోజులు నీమీద జాగ్రత్తగా కన్నువేసి వుంచాను. మొదటి రెండురోజులు నువ్వు చాలా బుద్ధిమంతుడిలా, అమాయకుడిలా కన్పించావు. కానీ అకస్మాత్తుగా మొనగాడివైపోయావు!

"ఆ రోజు జానీతోసహా వాడి ముఠాని కూడా కలిపి యెలా కొట్టావో తలచుకుంటే నాకే భయం వేసింది!

అప్పుడు నేను ఆఫీసుముందు నిలబడివున్నాను. ఈ రెండు పళ్ళు నువ్వు విసిరేసినప్పుడు నా నెత్తిమీద పడ్డాయి.

"అంతవరకు బాగానే వుంది - కానీ-ఆ రాత్రి ఏమయిందో గానీ, అకారణంగా కానిస్టేబిల్‌ని కొట్టి పారిపోయావు. నాకింకా భయం వేసింది! బహుశ పిచ్చిపట్టిందనుకున్నాను.

"మర్నాడు రాత్రి కూడా మరో యిద్దర్ని కొట్టి, సోడాబుడ్లు పగలగొట్టావు. నీ ప్రవర్తన నాకేమీ అర్థంగాక తల బద్దలు చేసుకున్నాను. చివరికి నీ ప్రవర్తనకి కారణం నీ డార్లింగ్ చావు అని తేల్చుకున్నాను. ఆమె వియోగంతో నీకు లోకంమీద విరక్తి పుట్టిందనుకున్నాను. ఇక ఈ అవకాశాల్ని ఉపయోగించుకుంటే నా పథకం పారుతుందని గ్రహించాను."

మాటలాపేసి సూటిగా చూసి, మళ్ళీ అన్నాడు శంకర్:

"ఆ రోజు నువ్వు కొత్తగూడెం వెళ్ళి మారువేషం సామాగ్రి తెచ్చుకున్నప్పుడు నిన్ను ట్రాప్‌లో యెలా ఇరికించాలో తట్టింది."

"ఏం చేశావు?" ఆత్రుత అణుచుకోలేక అనేశాను.

"బొమ్మపిస్తోలు చేతబట్టి పెట్రోలుబంకులో ప్రవేశించి బెదిరించావు గుర్తుందా? నిన్నరాత్రి!" ఫకాలున నవ్వాడతను. "నీ వెంట నేను కెమెరా చేతబట్టి వచ్చాను. నువ్వతనికి పిస్తోలు గురిపెట్టి గల్లాపెట్టె కొల్లగొడుతున్నప్పుడు కెమెరా క్లిక్‌మనిపించి చక్కటి ఫోటో తీశాను."

నేను సలసల మరుగుతున్న నూనెలో ఎత్తేసినట్లు కవ్వుమని అరిచాను.

"రిలాక్స్" అన్నాడు శంకర్.

నా కళ్ళముందు చీకటి తప్ప ఏమీ కన్పించడంలేదు.

రెండు చేతుల్లో తల పట్టుకుని గట్టిగా కళ్ళు మూసుకున్నాను.

అయితే ... ఆ కళ్ళు చెదిరే మెరుపు శంకర్ కమేరాదా!

నేను తేరుకుని తటాలున అతని మీదికి దూకాను.

"రాస్కెల్! నీకేం కావాలి? బ్లాక్ మెయిల్ చేస్తున్నావా! నన్ను నాశనం చేస్తావా? నేనీ వెధవపన్లు చేసింది ఎవరివల్ల? జానీముఠాని కొట్టానంటే ఆ శక్తి ఎవరిది? కానిస్టేబిల్ నీ, ఆ మనుషుల్ని కొట్టానంటే కారణం ఎవరు? పెట్రోలుబంకులో బెదిరించడానికి ప్రేరేపించిందెవరు? మాట్లాడు బాస్టర్ట్!"

"ఏమిటి కమల్! నిన్నెవరు ప్రేరేపించారు?"

"నువ్వు! నీ వెధవ ఫోటో! నీ దిక్కుమాలిన చరిత్ర! నీ గురించి చదివివుండకపోతే జానీ చేతిలో చచ్చేవాణ్ని! నీ ధైర్యసాహసాలు తలచుకుని వాణ్ని కొట్టకపోతే నాకు చావు మూడేది!"

"నా గురించి చదివి నువ్విలా చేశావంటే నాకాశ్చర్యంగా వుంది!" అన్నాడతను నన్ను వెనక్కి తోసి-ఎర్రబడ్డ ముఖంతో.

నేను ఆయాసంతో వగరుస్తూ కుర్చీలో కూలబడ్డాను.

ఓహ్, ఏమిటిది! నేను మనసులో గురువుగా ఆరాధించేది వీడా! జానీనుంచి నన్ను రక్షించినందుకు అభినందనలతో ముంచెత్తాలనుకున్నది వీడా! వీడి మాయలోపడి నేను చేసిన వెధవపనులకి వీడే బుద్ధి చెప్తున్నాడా! వీడు-వీడెవడు గుంటనక్క.

"కమల్, నా మాట వింటే నీకేమీ ప్రమాదం వుండదు!" అన్నాడతను జేబులోంచి ఓ కవరు తీసి.

ఆ కవరులోంచి ఒక ఫోటోతీసి నాకిచ్చాడు "బాగుంది

కదూ?''

ఫోటో తీసి చూశాను. ఎంత చక్కగా తీశాడు! నా ముఖంలో క్రూరత్వం, అలెండర్ ముఖంలో ఆందోళన ఎంత స్పష్టంగా కన్పిస్తున్నాయి!

ఫోటో కిందపెట్టి శంకర్‌ని చూశాను: ''ఎంత కావాలి?''

''నీ అంచనా తప్పు!'' అన్నాడతను, తిరిగి బటానీలు తింటూ.

''అంటే?''

''ఆఫ్టాల్ ఓ సెక్రటరీ దగ్గర నేనెంత డబ్బు గుంజ తాననుకున్నావు? వందలు-అతికష్టంమీద వేలు. నిన్ను డబ్బుకోసం బ్లాక్‌మెయిల్ చెయ్యడం తెలివితేనితనం! పాపం కూడా!'' అన్నాడు శంకరం వింతగా నవ్వుతూ.

ఇంతకూ శంకరం ప్లాన్ ఏమిటి? కమలాకర్‌ను దేనికి బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు?...

కమలాకర్ తను పిరికివాడు కాడని నిరూపించుకుంటాడా? లేక కొత్త చిక్కులు కొని తెచ్చుకుంటాడా?...

జానీగ్యాంగ్ ఏమైనట్లు? కమలాకర్‌పై పగ తీర్చుకుంటాడా? వదులుతాడా?

మాధవి విషయం ఏమిటి?...

వీటన్నిటికి సమాధానాలు ''మాయమైన వంటగత్తె'' (పరువు ఖరీదు-రెండవ భాగం)లో చదవండి...వచ్చే సంచికలో...